

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:123 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 24-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

అధికారపు గద్దె కోసం
నువ్వు ఆడిన నాటకంలో
ముందు వరుసలో నిలబడ్డావని
మురిసిపోకు మిత్రమా, సిద్ధాంతాలకు
కట్టుబడి నేను వెనకబడ్డానని
నన్ను తక్కువ అంచనా వేయకు.
ప్రజల ఆశల సమాధులపై
నిర్మించుకున్న నీ సింహాసనమైనా,
నిజాయితీ పునాదులపై నిలబడ్డ
నా ప్రయాణమైనా...చివరికి చేరేది
ఆ చరిత్ర పుటల తీర్పు
ముందుకు మాత్రమే!
ఇది విలువలతో కూడిన రాజకీయం
నడిచే కలికాలం కాదు...
పూటకో జెండా మార్చి,
జనం జేబులు కొట్టి,
కులమతాల చిచ్చుపెట్టి గెలిచే
అసలైన కలియుగం!
ఇక్కడ అబద్ధానికి ఉన్నంత వేగం
నిజానికి లేదు, మోసానికి ఉన్నంత
విలువ నిబద్ధతకు లేదు.
కానీ ఒక్కటి గుర్తుంచుకో...
నీ అధికారపు మత్తు దిగే రోజు వస్తుంది,
కాలం అనే ఓటరు వేసే చివరి తీర్పులో
మన ఇద్దరి స్థానం ఏంటో తేలిపోతుంది!

వారే వేణు గోపాల్..
పాపన్నపేట....మెదక్ జిల్లా



కరీంనగర్‌లో కాషాయ గర్జన

- కాంగ్రెస్‌పై నితిన్ నబీన్, బండి సంజయ్ నిప్పులు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)కు మద్దతుగా బీజేపీ మహాపాదయాత్ర
- రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుంటే.. బీజేపీ హృదయంలో ఉంచుకుంటుందన్న నితిన్ నబీన్
- ఓట్ల చోరీ ఆరోపణలను తిప్పికొడుతూ అసలైన ఓట్లు తమవైపే ఉన్నాయని వ్యాఖ్య
- చనిపోయిన 4 కోట్ల మంది ఓట్లు తొలగించడం తప్పా అని బండి సంజయ్ ప్రశ్న.
- విదేశీయుల ఓట్లను తొలగించి, అక్రమ చొరబాటుదారులను సరిహద్దులు దాటించాలని ఘాటు వ్యాఖ్యలు





ప్రజా వాయిస్, కరీంనగర్: తెలంగాణ రాజకీయాల్లో కరీంనగర్ వేదికగా బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)కు మద్దతుగా నిర్వహించిన మహాపాదయాత్ర సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నితిన్ నబీన్ విమర్శలు సంధించగా, ఓటర్ల జాబితా ప్రక్షాళనపై బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. రాజ్యాంగం, ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా అంశాల చుట్టూ సాగిన ఇరువురు నేతల ప్రసంగాలు సభకు తరలివచ్చిన భారీ జనసందోహంలో ఉత్సాహం నింపాయి.

రాహుల్ గాంధీపై నితిన్ నబీన్ విమర్శలు..

కరీంనగర్‌లో జరిగిన బీజేపీ మహాపాదయాత్రకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)పై ఇండియా కూటమి అనవసరంగా వివాదం సృష్టిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ వివరిస్తున్న వాస్తవాలకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ప్రజల ఆశీస్సులు, అసలైన ఓట్లు తమవైపే ఉన్నాయని వ్యాఖ్యానించారు.రాజ్యాంగం గురించి కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపైనా నితిన్ నబీన్ కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని కేవలం జేబులో పెట్టుకుని తిరుగుతారని, కానీ బీజేపీ మాత్రం రాజ్యాంగాన్ని హృదయంలో ఉంచుకుని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టేందుకే ఈ

మిగతా 2లో

లోన్ యాప్ ఆగడాలకు అడ్డూఅదుపు లేదా?

- అన్న చేసిన అప్పుకు చెల్లికి వేధింపులు
- సోదరుడు తీసుకున్న రూ.లక్ష రుణం చెల్లించాలంటూ మహిళకు బెదిరింపులు
- డబ్బులు కట్టకపోతే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని హెచ్చరిక
- ఆధార్ వివరాలు తమ వద్ద ఉన్నాయంటూ ఆగంతకుల బ్లాక్‌మెయిల్
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఫిలింనగర్ పోలీసులు
- ఇటీవలే లోన్ యాప్ వేధింపులకు కానిస్టేబుల్ బలి

2 లో

కృష్ణా జలాలపై కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు: సీఎం రేవంత్ రెడ్డి

- కేసీఆర్, హరీశ్ రావు హయాంలోనే తెలంగాణ నీటి వాటాకు తీవ్ర నష్టం జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపణ.
- 2015లో 298.96 టీఎంసీల వాటాకు అంగీకరించి, 2020లో శాశ్వత ఒప్పందానికి సమ్మతించారని విమర్శ.
- పల్నాడు వాటర్ గ్రిడ్ జీవో 56పై నాడు కేసీఆర్ ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదని వెల్లడి.
- పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, హంద్రీనీవా జీవోల సమయంలో టీఆర్ఎస్ నేతలు మంత్రివర్గంలో ఉన్నారని గుర్తుచేసిన సీఎం.
- ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో తెలంగాణ హక్కుల కోసం బలంగా పోరాడుతున్నామని స్పష్టీకరణ



ప్రజా వాయిస్, హైదరాబాద్: కృష్ణా నది జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గతంలో కేసీఆర్, హరీశ్ రావు హయాంలోనే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు పాత జీవోలు, ఒప్పందాలు, నీటి వినియోగ గణాంకాలను ప్రస్తావిస్తూ.. వాస్తవాలను పక్కనపెట్టి కేటీఆర్, హరీశ్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సీఎం విమర్శించారు.

పల్నాడు వాటర్ గ్రిడ్‌పై నాడు మౌనం ఎందుకు?

పల్నాడు వాటర్ గ్రిడ్ విషయంలో 2022 ఫిబ్రవరి 16న ఏపీ సీఎంగా వైఎస్ జగన్, తెలంగాణ సీఎంగా కేసీఆర్ ఉన్న సమయంలో జీవో నంబర్ 56 విడుదలైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద పల్నాడు, గుంటూరు జిల్లాల తాగునీటి అవసరాల కోసం రూ.1,200 కోట్లతో ఈ పథకాన్ని రూపొందించారని, కేంద్రం రూ.500 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చేలా నిర్ణయించారని చెప్పారు. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా బోర్డు వద్ద గానీ, కేంద్రం వద్ద గానీ ఎలాంటి అభ్యంతరం తెలపలేదని ఆయన ఆరోపించారు. ఈ విషయం తమ ప్రభుత్వం దృష్టికి రాగానే కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేశామని, పనులు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారని సీఎం వివరించారు.

పోతిరెడ్డిపాడు, నీటి వాటాల ఒప్పందాల ప్రస్తావన

2004లో వైఎస్ఆర్ మంత్రివర్గంలో

మిగతా 2లో

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

- మంగళవారం (నవంబర్ 24) హైదరాబాద్‌లో పర్యటించాల్సి ఉన్న అమిత్ షా.
- అనివార్య కారణాలతో పర్యటన రద్దైనట్లు వెల్లడించిన సంబంధిత వర్గాలు
- బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఐటీసీ కాకతీయ హోటల్‌లో ప్రముఖులతో భేటీ కావాల్సి ఉన్న షెడ్యూల్
- రాత్రి 7.30 గంటలకు ఓ ప్రైవేట్ ఛానల్ కార్యక్రమంలో పాల్గొనేలా ముందస్తు ఏర్పాట్లు.
- చివరిసారిగా నవంబర్ 2న హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ మహాపాదయాత్రకు హాజరైన కేంద్ర మంత్రి.



2 లో

కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది

- 2028లో మళ్లీ కేసీఆరే సీఎం: కేటీఆర్
- రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి పర్సంటేజీల పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపణ
- సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే కమీషన్ల దందాపై విమర్శలు చేస్తున్నారని ప్రస్తావన
- మహిళలకు రూ.1.50 లక్షల బకాయిలు చెల్లిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్
- ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు వెనుక సీఎం, మంత్రి కుటుంబాల ప్రైవేట్ విద్యాసంస్థల ప్రయోజనాలు ఉన్నాయని విమర్శ
- వరంగల్‌కు మూడేళ్లలో ఒక్క కొత్త ఐటీ కంపెనీ, పరిశ్రమ రాలేదని మండిపాటు



ప్రజా వాయిస్, వరంగల్:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి అవినీతి, కమీషన్ల దందాకు ప్రాధాన్యత ఇస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వరంగల్ కాకతీయ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ జనచైతన్య సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇంకా 500 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని వ్యాఖ్యానించిన కేటీఆర్.. 2028లో కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సొంత పార్టీ నేతల వ్యాఖ్యలే అవినీతికి నిదర్శనం

వరంగల్‌లో మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం సున్నా, అభివృద్ధి గుండుసున్నా అని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో పెరిగిందో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.5 లక్షల నుంచి

మిగతా 2లో

ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రండి

- అజ్ఞాతంలో ఉన్న ముగ్గురు సీనియర్ మావోయిస్టు అగ్రనేతలకు డీజీపీ సీవీ ఆనంద్ పిలుపు
- మొత్తం 659 మందికి రూ.17.68 కోట్ల 35 వేల నగదు ప్రోత్సాహకాలు అందజేత
- తాజాగా 214 మంది మావోయిస్టులకు రూ.5.59 కోట్ల రివార్డుల పంపిణీ
- 2024 నుంచి ఇప్పటివరకు 824 మంది మావోయిస్టులు లొంగుబాటు

2 లో



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 నుంచి 100 సీట్లు ఖాయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికతో 90 సీట్లు, తన ప్లాన్‌తో అయితే 100కు పైగా సీట్లు గెలుస్తామని మంత్రి ధీమా
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని వ్యాఖ్య.
- రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ఏకైక లక్ష్యమని, కష్టపడ్డ కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని సూచన
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రెండు స్థానాలనూ కైవసం చేసుకుంటామని విశ్వాసం



ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ప్రకారం వెళితే కనీసం 90 స్థానాల్లో విజయం సాధిస్తామని, అదే తాను రూపొందించిన ప్లాన్ ప్రకారం ముందుకు సాగితే 100కు పైగా సీట్లు గెలుచుకుంటామని ఆయన జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం సందర్భంగా, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సందీప్‌తో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

కార్యకర్తలకు అవకాశాలు..
రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై

మిగతా 2లో

లోన్ యాప్ ఆగడాలకు అడ్డూఅదుపు లేదా?



ప్రజా వాయిస్, హైదరాబాద్: దేశవ్యాప్తంగా లోన్ యాప్‌ల వేధింపులతో ఎంతోమంది ప్రాణాలు తీసుకుంటున్న వేళ, హైదరాబాద్ నగరంలో మరో దారుణ ఘటన వెలుగుచూసింది. అప్పు తీసుకున్న వ్యక్తిని వదిలేసి, ఏమాత్రం సంబంధం లేని అతని సోదరిని లక్ష్యంగా చేసుకుని లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులకు దిగారు. డబ్బులు చెల్లించకపోతే ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించడంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించారు.

ఆధార్ వివరాలు ఉన్నాయంటూ బ్లాక్‌మెయిల్

షేక్‌పేటకు చెందిన ఓ మహిళ సోదరుడు ఇటీవల లోన్ యాప్ ద్వారా రూ.లక్ష రుణం తీసుకున్నాడు. అయితే ఆ అప్పుతో తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా గుర్తుతెలియని వ్యక్తులు తనకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ వద్ద ఆమె వ్యక్తిగత వివరాలు, ఆధార్ కార్డు సమాచారం ఉన్నాయని ఫోన్ చేసిన వ్యక్తులు బెదిరించినట్లు తెలిపారు.సోదరుడు తీసుకున్న రూ.లక్ష రుణం మొత్తం వెంటనే చెల్లించకపోతే, ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని ఆగంతకులు హెచ్చరించారు. వేధింపులు తీవ్రం కావడంతో ఈ ఆగడాల నుంచి తనను రక్షించాలని కోరుతూ ఆమె పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్ కాల్స్ చేసిన వ్యక్తులు ఎవరు, వారి వెనుక ఎవరెవరు ఉన్నారు, లోన్ వసూలు పేరుతో మహిళను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఇటీవలే కానిస్టేబుల్ బలి..
భార్యకూ తప్పని వేధింపులు

మరోవైపు, లోన్ యాప్ వేధింపులు తట్టుకోలేక ఇటీవలే హైదరాబాద్ నగరంలో ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర దుమారం రేపింది. తుక్కుగూడలోని హర్షగూడకు చెందిన ముడావత్ శ్రీను (31) కొండాపూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. నాలుగు నెలల క్రితం క్రికెట్ బెట్టింగ్‌ల కోసం ఓ లోన్ యాప్ ద్వారా రూ.40 వేల లోన్ తీసుకున్నారు. సకాలంలో రుణం చెల్లించకపోవడంతో ఏజెంట్లు అతడి ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపడంతో పాటు సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు.దీపావళి పండుగకు భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో వేధింపులు మరింత తీవ్రం కావడంతో మనస్తాపానికి గురైన శ్రీను, సోమవారం హర్షగూడలోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి ఫిర్యాదుతో పహాడీ షరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్త మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న అతడి భార్యకు సైతం ఏజెంట్లు ఫోన్ చేసి రుణం చెల్లించాలని ఒత్తిడి చేయడంతో పాటు అసభ్యంగా దూషించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రండి



ప్రజా వాయిస్, హైదరాబాద్: ఆయుధాలు వీడి ప్రజాస్వామ్య పంథాలోకి వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని అజ్ఞాతంలో ఉన్న ముగ్గురు సీనియర్ మావోయిస్టు అగ్రనేతలకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. లొంగిపోయే మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పునరావాసం, ఆర్థిక సహాయం, జీవనోపాధి కల్పనకు పోలీస్ శాఖ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

లొంగుబాట్లలో వేగం.. మూడేళ్లలో 824 మంది

2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు తెలంగాణ పోలీసుల ఎదుట మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ వెల్లడించారు. వీరిలో 2024లో 49 మంది, 2025లో 509 మంది, 2026లో ఇప్పటివరకు 266 మంది ఉన్నారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన వారు 59 మంది, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 754 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 9 మంది, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు.

రూ.22.31 కోట్ల రివార్డులు మంజూరు

లొంగిపోయిన వారిలో అర్హులైన 755 మందికి మొత్తం రూ.22.31 కోట్లకు పైగా నగదు రివార్డులు మంజూరు చేసినట్లు డీజీపీ తెలిపారు. ఇప్పటివరకు 659 మందికి రూ.17.68 కోట్ల 35 వేల నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు వివరించారు. తాజాగా 214 మందికి రూ.5.59 కోట్లు పంపిణీ చేశారు. లొంగిపోయిన సమయంలో ఒక్కొక్కరికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.25 వేల చొప్పున కూడా అందించినట్లు పేర్కొన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు సమర్పించాల్సి ఉన్న మిగిలిన 96 మందికి వాటిని అందించిన వెంటనే నగదు జమ చేస్తామని తెలిపారు.

ఉచిత వైద్యం.. ఇళ్ల స్థలాల కేటాయింపు

నగదు ప్రోత్సాహకాలతో పాటు లొంగిపోయిన వారి పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని డీజీపీ తెలిపారు. తెలంగాణకు చెందిన 59 మందిలో 57 మందికి నిమ్స్ ఆసుపత్రిలో నగదు రహిత వైద్యం పొందేందుకు ఆరోగ్య రక్షణ కార్డులు అందించారు. మరో ఇద్దరికి ఆధార్ వివరాలు అందిన తర్వాత కార్డులు జారీ చేయనున్నారు. అలాగే 10 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, మిగిలిన 49 మందికి స్థలాల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 765 మందికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పునరావాస ప్రయోజనాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

కర్రెగుట్టల్లో భారీగా ఆయుధాల స్వాధీనం

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల ప్రాంతంలో పోలీసులు తొమ్మిది ఆయుధ డంపులను గుర్తించి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 252 తుపాకులు, 359 బీజీఎల్ షెల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. వీటిలో 48 ఏకే-47 రైఫిళ్లు, 37 ఇన్సాస్ రైఫిళ్లు, 37 ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు ఎల్ఎంజీలు, 25 .303 రైఫిళ్లు ఉన్నట్లు తెలిపారు. కర్రెగుట్టల ప్రాంతంలో మందుపాతరల ముప్పు పూర్తిగా తొలగించి, భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే పర్యాటకులకు అనుమతి ఇస్తామని డీజీపీ స్పష్టం చేశారు.

గణపతితో పాటు మరో ఇద్దరికి పిలుపు

తెలంగాణకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు మరో ఇద్దరు సీనియర్ మావోయిస్టు నేతలు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు డీజీపీ తెలిపారు. వారు సాయుధ పోరాటాన్ని విరమించి జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయే వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం ద్వారా ఆర్థిక సహాయం, వైద్య సదుపాయాలు, ఇళ్ల స్థలాలు తదితర ప్రయోజనాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. హింసకు దూరంగా ప్రశాంతమైన జీవితం గడుపుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీనియర్ నేతలకు సూచించారు.మావోయిస్టు ప్రభావాన్ని తగ్గించడంతో పాటు ఆయుధాలు వీడి తిరిగి వచ్చిన వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించడమే ప్రభుత్వ పునరావాస విధానం లక్ష్యమని పోలీస్ శాఖ పేర్కొంటోంది

కృష్ణా జలాలపై కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు: సీఎం రేవంత్ రెడ్డి



టీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు మంత్రులు ఉన్నారని సీఎం గుర్తుచేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచే నిర్ణయానికి అప్పటి ప్రభుత్వంలోనే మార్గం సుగమమైందని పేర్కొన్నారు. 2005 మార్చి 29న అసెంబ్లీలో ప్రస్తావించి, సెప్టెంబర్ 13న జీవో విడుదల చేశారని, అలాగే 2004 జూలై 24న హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు తరలించేందుకు జీవో ఇచ్చారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 జూన్ 26న నాటి కేంద్ర మంత్రి ఉమాభారతి సమక్షంలో కేసీఆర్, హరీశ్ రావు ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీల వాటాకు అంగీకరించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. అంతేకాకుండా, 2020 జనవరి 29న ఈ నీటి పంపకాలను శాశ్వతంగా కొనసాగించేలా సమ్మతించారని ఆయన ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 జూన్ 26న నాటి కేంద్ర మంత్రి ఉమాభారతి సమక్షంలో కేసీఆర్, హరీశ్ రావు ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 298.96 టీఎంసీల వాటాకు అంగీకరించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. అంతేకాకుండా, 2020 జనవరి 29న ఈ నీటి పంపకాలను శాశ్వతంగా కొనసాగించేలా సమ్మతించారని ఆయన ఆరోపించారు.

పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు

పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణలోని ఎస్ఎల్బీసీ, కల్వకుర్తి, నెట్టంపాడు, పాలమూరు-రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులు పూర్తికాలేదని ముఖ్యమంత్రి అన్నారు. అదే సమయంలో రాయల సీమలో మాత్రం ఎనిమిది ప్రాజెక్టులను వేగంగా నిర్మించారని పేర్కొన్నారు. 2023-24లో ఏపీ 208.79 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 119 టీఎంసీలు మాత్రమే వాడుకుందని గణాంకాలు వెల్లడించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రాజెక్టుల భూసేకరణకు రూ.6,765 కోట్లు కేటాయించిందని, ఉద్దండాపూర్‌లో ముంపు బాధితుల పునరావాసానికి రూ.600 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.

న్యాయపోరాటం, కేంద్రంతో సంప్రదింపులు

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో తెలంగాణ తరఫున బలమైన వాదనలు వినిపిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను పలుమార్లు కలిశామని చెప్పారు. ప్రాజెక్టుల అనుమతుల విషయంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులతోనూ చర్చించామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాల హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది

రూ.10 లక్షల వరకు వసూళ్లు జరుగుతున్నాయని చెబుతుంటే, మరో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పనులు జరగాలంటే 20 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారని గుర్తుచేశారు. పారిశ్రామికవేత్తల తలపై తుపాకీ పెట్టి ముఖ్యమంత్రి సోదరులు వందల కోట్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని, మంచిరేవుల దేవాలయ భూముల వ్యవహారంలోనే తనను మంత్రి పదవి నుంచి తొలగించారని మాజీ మంత్రి కొండా సురేఖ స్వయంగా చెప్పారని ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాపాలన కంటే పర్సంటేజీల పాలనే ఎక్కువగా కనిపిస్తోందని ఆరోపించారు.

మహిళలకు రూ.1.50 లక్షలు ఇస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 36 నెలలు గడిచినా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.85,500, ఇతర పెండింగ్ హామీలు కలిపి రూ.1.50 లక్షలు బకాయి పడ్డారని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు రూ.1.50 లక్షల చొప్పున చెల్లించి లక్షాధికారులను చేసి చూపించాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఆ హామీ నెరవేరిస్తే తాను శాశ్వతంగా రాజకీయాలను వదిలిపెట్టి వెళ్లిపోతానని ప్రకటించారు. కల్యాణలక్ష్మి తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు ఆర్థిక సాయం వంటి హామీలను విస్మరించారని, 4.71 లక్షల పెన్షన్లను తొలగించి కొత్తగా కేవలం 4.63 లక్షల పెన్షన్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు.

ఇంటర్ వ్యవస్థ రద్దు వెనుక కుటుంబ ప్రయోజనాలు

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రయత్నాల వెనుక సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ ప్రయోజనాలు ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. వారి పిల్లలు ప్రైవేట్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నందున, వ్యాపారాలకు అడ్డుగా ఉందనే ఉద్దేశంతోనే ఇంటర్ వ్యవస్థను రద్దు చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

వరంగల్ అభివృద్ధిపై వివక్ష..
ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రచారం

బీఆర్ఎస్ హయాంలో వరంగల్‌లో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు 90 శాతం పూర్తి చేశామని, మడికొండ ఐటీ పార్కుకు ఎల్ అండ్ టీ మైండ్‌ట్రీ, సైయెంట్, టెక్ మహీంద్రా వంటి కంపెనీలు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కిటెక్స్, యంగ్‌వన్ వంటి పరిశ్రమలను తీసుకొచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూడేళ్లుగా వరంగల్‌కు ఒక్క కొత్త ఐటీ కంపెనీ గానీ, టెక్స్‌టైల్ పరిశ్రమ గానీ రాలేదని విమర్శించారు. ఫార్మా సిటీ పేరు మార్చి ఫ్యూచర్ సిటీ అని ప్రచారం చేసుకుంటున్నారని, నిజమైన ఫ్యూచర్ ఉన్న సిటీ వరంగల్ అని పేర్కొన్నారు. గోదావరి జలాలను వాడుకోవడంలో, దేవాదుల, కన్నెపల్లి పంపులను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.



కరీంనగర్‌లో కాషాయ గర్జన

మహాపాదయాత్ర చేపట్టినట్లు ఆయన వివరించారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగించడం తప్పా?

ఈ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో కనిపిస్తున్న జనసందోహాన్ని చూస్తుంటే ఈ ప్రాంతం కాషాయ గడ్డ అని మరోసారి నిరూపితమైందని అన్నారు. బీజేపీ ఉనికి లేదంటున్న శక్తులకు ఈ మహాపాదయాత్రే గట్టి సమాధానమని వ్యాఖ్యానించారు. తమ గుండె చప్పుడు కూడా 'జై శ్రీరాం' నినాదమే పలుకుతోందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారి పేర్లను తొలగించడాన్ని తప్పుబట్టడం ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మరణించిన సుమారు నాలుగు కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం అత్యవసరమని అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లో మరణించినప్పటికీ, ఇటీవలి ఎస్ఐఆర్ ప్రక్రియ వరకు ఆయన పేరు ఓటర్ల జాబితాలో కొనసాగిందని ఉదాహరణగా ప్రస్తావించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించడం కూడా ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

విదేశీయుల ఓట్లపై
బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

దేశంలో నాయకులను ఎన్నుకునే అధికారం కేవలం భారత పౌరులకే ఉండాలని బండి సంజయ్ స్పష్టం చేశారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన వ్యక్తులు భారతదేశంలో ప్రజాప్రతినిధులను, ముఖ్యమంత్రులను నిర్ణయించే పరిస్థితి ఎన్నటికీ ఉండకూడదని వ్యాఖ్యానించారు. విదేశీయుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటే వాటిని తొలగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను సరిహద్దులు దాటించే వరకు పంపించాలని ఆయన ఘాటుగా డిమాండ్ చేశారు.

దమ్ముంటే వరంగల్ పశ్చిమలో కేటీఆర్ పోటీ చేయాలి

- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని కాంగ్రెస్ నేతల ఆరోపణ.**
- **గత పాలన కొబ్బరికాయలు, శిలాఫలకాలకే పరిమితమైందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శ**
- **అభివృద్ధిపై పూర్తి ఆధారాలు, జీవోలతో హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్.**



ప్రజా వాయిస్, హనుమకొండ: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేశారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (డీసీసీ భవన్)లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

శిలాఫలకాలకే పరిమితమైన గత పాలన

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పంద అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారని, పందసార్లు ముక్కు నేలకు రాసినా ప్రజలు ఆయన్ను క్షమించే పరిస్థితిలో లేరని ఆరోపించారు. గత పాలన కొబ్బరికాయలు కొట్టడం, శిలాఫలకాలు వేయడానికే పరిమితమైందని, నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ప్రజలు బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించేవారని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోందని తెలిపారు. కాళోజీ కళాక్షేత్రం విషయంలో గత ప్రభుత్వం రూ.20 కోట్లతో పిల్లర్లు, స్లాబ్ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసిందని, నిర్మాణ నాణ్యతపై ఎన్ఐటీ నివేదికలతో పరిశీలన చేయించాల్సి వచ్చిందని నాయిని వివరించారు. భవనం పటిష్టత కోసం కేటాయించిన మరో రూ.10 కోట్ల వినియోగంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, దీనిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని చెప్పారు. తాను ఎమ్మెల్యే అయ్యాక కుడా, పర్యాటక శాఖల సమన్వయంతో రూ.80 కోట్లు సమకూర్చి పనులు చేపట్టామని పేర్కొన్నారు. కళాక్షేత్రం రెండో అంతస్తులను కమర్షియల్ కాంప్లెక్స్‌కు అద్దెకు ఇచ్చేందుకు గత ప్రభుత్వమే జీవోలు జారీ చేసిందని గుర్తుచేశారు.

అభివృద్ధి పనులు, నిధులపై
బహిరంగ చర్చకు సవాల్

వరంగల్ విమానాశ్రయానికి గతంలో 696 ఎకరాల 14 గుంటల భూమి మాత్రమే ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.205 కోట్లకు పైగా ఖర్చు చేసి మరో 253 ఎకరాల భూమిని సేకరించిందని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని నేతలు వెల్లడించారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.550 కోట్లతో వాటర్ వర్క్స్ ఆధునీకరణ పనులు చేపట్టామని, నాలుగు అంగుళాల పైపుల స్థానంలో ఎనిమిది అంగుళాల పైపులు వేస్తున్నామని తెలిపారు. హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, స్థల పరిశీలన చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారని చెప్పారు. గత ప్రభుత్వం రింగ్ రోడ్డు పేరుతో హడావుడి చేసినా ఆ ప్రాజెక్టు జీవోనే రద్దయిందని, మాస్టర్ ప్లాన్‌ను కూడా అమలు చేయలేని వారు ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని నాయిని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పనులపై పూర్తి ఆధారాలు, జీవోలతో హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై నమ్మకం ఉంటే కేటీఆర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేయాలని సవాల్ చేశారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

ప్రజా వాయిస్, హైదరాబాద్:కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దైంది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం (నవంబర్ 24) ఆయన హైదరాబాద్ పర్యటనకు రావాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఈ పర్యటనను రద్దు చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రద్దైన పర్యటన షెడ్యూల్ వివరాలు..ముందస్తు షెడ్యూల్ ప్రకారం, అమిత్ షా మంగళవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బయలుదేరి సాయంత్రం 5.40 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హోటల్ ఐటీసీ కాకతీయకు వెళ్లి, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకు అక్కడే బస చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ సమయంలో పలువురు ప్రముఖులు ఆయనతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం రాత్రి 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నగరంలో ఓ ప్రైవేట్ ఛానల్ నిర్వహించే కార్యక్రమంలో అమిత్ షా పాల్గొనాల్సి ఉంది. కార్యక్రమం ముగిసిన తర్వాత రాత్రి 8.50 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తిరిగి ఢిల్లీకి బయలుదేరేలా షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే, అనివార్య కారణాల దృష్ట్యా ఈ పర్యటన రద్దైనట్లు అధికారులు తెలిపారు.

నవంబర్ 2న చివరి పర్యటన..

ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రి అమిత్ షా చివరిసారిగా ఈ నెల 2వ తేదీన హైదరాబాద్‌లో పర్యటించారు. బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహించిన ''ప్రజా స్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి'' కార్యక్రమంలో భాగంగా, హైదరాబాద్‌లో చేపట్టిన మహాపాదయాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 నుంచి 100 సీట్లు ఖాయం

ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఇన్‌చార్జి సందీప్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. సంవత్సరాలుగా కష్టపడి పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన అవకాశాలు, పదవులు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమందరి ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే, రానున్న ఎన్నికలకు కీలకమైన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రెండు స్థానాలనూ తామే గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

మరోవైపు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసిందో గుండె మీద చేయి వేసుకుని చెప్పాలని డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం రాష్ట్ర ప్రభుత్వం 96 శాతం భూసేకరణ పూర్తి చేసినప్పటికీ, కేంద్ర కేబినెట్ ఆమోదం ఇవ్వకుండా టెండర్లను మూడుసార్లు వాయిదా వేసిందని విమర్శించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల్లో వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రూ.12 వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు అప్రూవల్ వచ్చినా కేంద్రం ఎందుకు పెండింగ్‌లో పెట్టిందని ఆయన ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర నిధులను నిర్లక్ష్యం చేస్తే, తాము అన్ని అనుమతులు సిద్ధం చేసినా బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఏం ఒరగబెట్టారని అమిత్ షా, నితిన్ నబీన్, జేపీ నడ్డా రాష్ట్రానికి వస్తున్నారని నిలదీశారు. రాజకీయాలు పక్కన పెట్టి తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం తక్షణమే కేబినెట్ ఆమోదం తెలపాలని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు.





మేడిపల్లిలో సంక్షేమ సంబురం..!

- 24 మందికి కొత్తగా పెన్షన్లు.. 630 మందికి స్మార్ట్ రేషన్ కార్డులతో అర్హుల ముఖాల్లో ఆనందం
- సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు సంక్షేమ ఫలాల పంపిణీ

మొయినాబాద్(ప్రజావాయిస్): గ్రామాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక వసతుల కల్పనే కాదు.. గ్రామంలోని ప్రతి అర్హత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందినప్పుడే నిజమైన ప్రగతికి అర్థం చేకూరుతుంది. ఈ ఆలోచనకు అనుగుణంగా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో నూతనంగా మంజూరైన 24 పెన్షన్లను, 630 స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కొత్తగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులకు నెలవారీ ఆర్థిక చేయూత లభించనుండగా, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయి.ఒకవైపు వృద్ధులు, అర్హులైన వారికి పెన్షన్ రూపంలో ఆర్థిక భరోసా.. మరోవైపు కుటుంబాలకు రేషన్ కార్డుల రూపంలో ఆహార భద్రత అందించే ఈ కార్యక్రమంతో గ్రామంలో సంతోషం వ్యక్తమైంది. గ్రామ ప్రజల అవసరాలను గుర్తిస్తూ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేయడం, గ్రామ సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మమత, రమేష్, నవీన్ కుమార్, బాలరాజ్, మధుకర్, మాధవి, శ్రీశైలం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి రికవరీలో గందరగోళం.!

- వివోఏలపై ఒత్తిళ్లు..రాజకీయ జోక్యంతో ఇక్కట్లు
- చెల్లింపులకు, ఆన్ లైన్ లెక్కలకు పొంతనేది.?
- గ్రామాలవారీగా రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యత్యాసాలు
- కొందరి బకాయిలకు.. అందరికీ రుణాలు నిలిపివేత
- 29 గ్రామాల్లో రికవరీ తీరుపై సమగ్ర విచారణకు డిమాండ్



ప్రజా వాయిస్,పెన్‌పహాడ్: శ్రీనిధి రుణాల రికవరీ వ్యవహారం పెన్‌పహాడ్ మండలంలో వివాదాస్పదంగా మారుతోంది. 29 గ్రామాల్లో రుణాల వసూళ్లు, చెల్లింపుల నమోదు, కొత్త రుణాల మంజూరులో అనేక సమస్యలు వెలుగుచూస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సభ్యులు చెల్లిస్తున్న మొత్తాలకు ఆన్‌లైన్‌లో నమోదవుతున్న లెక్కలకు మధ్య వ్యత్యాసాలు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు కొందరు సభ్యులు రుణాలు చెల్లించకపోతే గ్రామంలోని ఇతర సంఘాలకు సైతం కొత్త రుణాలు నిలిచిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి రాజకీయ జోక్యాలు తోడవడంతో రికవరీ బాధ్యతలు నిర్వహిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏలు) తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

లెక్కల్లో లక్షల వ్యత్యాసాలు

సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించకపోవడం, కొందరు తక్కువ మొత్తాలు చెల్లించడం, మరికొందరు వాయిదాలు నిలిపివేయడంతో రికవరీలో సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామస్థాయిలో వసూలైన మొత్తం, ఆన్‌లైన్‌లో నమోదైన మొత్తం మధ్య పొంతన లేకపోవడంతో గ్రామాలను బట్టి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వ్యత్యాసాలు ఉన్నట్లు సమాచారం. ఈ తేడాలకు కారణం లేమిటి? వసూలైన మొత్తాల వివరాలు ఎక్కడ నమోదవుతున్నాయి? బాధ్యులెవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కొందరి బకాయిలకు.. అందరికీ శిక్ష

గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తూ రుణాల మంజూరు ప్రక్రియ కొనసాగుతుండటంతో క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్న మహిళా సంఘాలకూ ఇబ్బందులు తప్పడం లేదు. ఒక గ్రామంలో ఐదుగురు, పది మంది సభ్యులు బకాయిలు చెల్లించకపోయినా, రెండు సంఘాలు రుణాలు బకాయి పెట్టినా.. ఆ గ్రామంలోని మిగిలిన సంఘాలకు సైతం కొత్త రుణాలు నిలిచిపోతున్నాయని వీవోఏలు చెబుతున్నారు. తప్పు చేసినవారికి బదులుగా సక్రమంగా చెల్లిస్తున్న సంఘాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రికవరీకి రాజకీయ అడ్డంకులు

నారాయణగూడెం, సింగిరెడ్డిపాలెం, మహమ్మదాపురం, ధర్మపురం తదితర గ్రామాల్లో రికవరీ ప్రక్రియకు వివిధ సమస్యలు ఎదురవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా సింగిరెడ్డిపాలెంలో రుణాల వసూళ్ల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు అధికంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వసూళ్ల బాధ్యతలు నిర్వహించాల్సిన సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.

బ్యాంకులకు ఒక నిబంధన.. శ్రీనిధికి మరో తీరా.?

బ్యాంకు లింకేజీ రుణాల విషయంలో సభ్యులు బ్యాంకు అధికారులను సంప్రదించి చెల్లింపులు చేసేందుకు ముందుకొస్తున్నప్పటికీ, శ్రీనిధి రుణాల విషయంలో మాత్రం కొందరు తమకు అనుకూలమైన మొత్తాలనే చెల్లిస్తున్నారనే విమర్శలున్నాయి. రుణ ఒప్పందాలు, వాయిదాల చెల్లింపులపై స్పష్టత లేకపోవడం, నిబంధనలు పాటించక పోవడం రికవరీని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి.

వీవోఏలకు భరోసా ఏదీ.?

ఒకవైపు రికవరీ లక్ష్యాలు పూర్తి చేయాలన్న ఒత్తిడి.. మరోవైపు రాజకీయ జోక్యాలు, సంఘాల మధ్య విభేదాలు, చెల్లింపుల లెక్కల్లో వ్యత్యాసాలు.. ఇలా అనేక సమస్యల మధ్య వీవోఏలు పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రికవరీ లెక్కలను పరిశీలించాలని, చెల్లింపుల్లో పారదర్శకత తీసుకురావాలని, బకాయిదారుల కారణంగా క్రమం తప్పకుండా చెల్లిస్తున్న సంఘాలకు రుణాలు నిలిపివేయకుండా తగిన పరిష్కారం చూపాలని సభ్యులు కోరుతున్నారు. రాజకీయ జోక్యాన్ని అరికట్టి వీవోఏలకు శాఖాపరమైన అండ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



జలదోపిడీని ఆపలేరు.. అర్హుల పెన్షన్లు ఇవ్వలేరు.!

- కాంగ్రెస్ సర్కారుపై బొల్లం మల్లయ్య యాదవ్ ఫైర్
- 510 అడుగుల డెడ్ స్టోరేజ్ నుంచే సాగర్ నీటి తరలింపు
- రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల పెన్షన్ల తొలగింపు
- దివ్యాంగులు, వృద్ధుల పట్ల ప్రభుత్వానికి కనికరం కరువైంది
- జలదోపిడీ ఆపకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఉద్యమం

ప్రజా వాయిస్,కోదాడ:ఒకవైపు నాగార్జునసాగర్ నుంచి 510 అడుగుల డెడ్‌స్టోరేజ్ స్థాయి నుంచే నీటిని తరలిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మరోవైపు అర్హులైన పేదలు, దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తూ అన్యాయం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మండిపడ్డారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగర్ జలదోపిడీని అరికట్టక పోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల పెన్షన్లు తొలగించి, కొత్త పెన్షన్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. సదరం సర్టిఫికెట్లు ఉన్న అసలైన దివ్యాంగులకు సైతం పెన్షన్లు నిరాకరించడం దారుణమన్నారు. ప్రజాధనాన్ని విలాసాలకు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి పేదల పెన్షన్లు ఇవ్వడం భారమైందా అని ప్రశ్నించారు. అర్హులందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, సాగర్ జలదోపిడీని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాలువను పూడ్చిన అక్రమార్కులు అడ్డుకున్నా నాయకులు,గ్రామస్థులు

జిన్నారం ప్రజావాయిస్ జిన్నారం మున్సిపల్ కేంద్రం పరిధిలోని గండి చెరువు కట్ట ధ్వసం మరియు అక్కమ్మ చెరువు వెళ్లే కాలువను పూడ్చి ఆక్రమించిన వారి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ నేపథ్యంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఎ.ఈ అఖిల,ఇంచార్జి ఎమ్మార్వో కరుణాకర్,ఆర్ఐ శ్రీనివాస్,జిపిఓ రఘు లు సోమవారం ధ్వసం గండి చెరువు కట్టను మరియు పూడ్చిన కాలువను పరిశీలించారు.కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు, స్థానిక ప్రజాప్రతినిధి సహకారంతో ఎక్స్కవేటర్లతో మట్టిని నింపి ఆక్రమించారని ఎన్నో ఏళ్లుగా గండి చెరువు కట్ట ఉండేదని దాన్ని పూర్తిగా ధ్వసం చేశారని అక్కమ్మచెరువుకు వచ్చే కాలువను సైతం అక్రమార్కులు వదలడం లేదని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. వెంటనే స్పందించిన అధికారులు అక్కడా జరుగుతున్న పనులను ఎక్స్కవేటర్ను రెవెన్యూ కార్యాలయంకు తరలించారు.ఈ సందర్భంగా అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రైవేట్ భూమిని సర్వే చేసి నిర్ధారించాలని స్థానిక నాయకులు,రైతులు అధికారులను కోరారు.అనంతరం ఇంచార్జి ఎమ్మార్వో కరుణాకర్,సి.ఐ నాగార్జున గౌడ్ గార్లకు లిఖితపూర్వకంగా నాయకులు ఎర్రవల్లి ప్రవీణ్,నాగరాజు యాదవ్,మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్ రెడ్డి,పుట్టి భాస్కర్,బండి శ్రీకాంత్ గౌడ్, చిటుకుల వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్,ఈద్గాని మల్లేష్,మోహన్,నిఖిల్, భాస్కర్,దుర్గయ్య,మల్లేష్,అశోక్,రవి,ప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేశారు.





వాహనం ఢీకొని కృష్ణజింక మృతి

- క్యాసారం రింగ్ రోడ్డు సమీపంలో ఘటన
- రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ
- కృష్ణజింక మృతిపై జంతు ప్రేమికుల ఆవేదన
- మూగజీవాల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :గుర్తుతెలియని వాహనం ఢీకొని కృష్ణజింక మృతిచెందిన ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారం రింగ్ రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రహదారి దాటుతున్న కృష్ణజింకను వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆ మూగజీవి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై జంతు ప్రేమికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై వాహనాలు వేగంగా ప్రయాణించే సమయంలో అప్రమత్తత లేకపోవడం వల్ల మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయని పేర్కొంటున్నారు. రహదారిపై జంతువులు కనిపించినప్పుడు వాహనదారులు వేగాన్ని తగ్గించి, వాటికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, మూగజీవాల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

సందిగ్నంలో సహకార సంఘం చైర్మన్లు

- నామినేట్ చేసిన ప్రమాణ స్వీకారానికి నోచుకోని వైన్యం
- పార్టీలు మారిన వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు
- పార్టీ కోసం కష్టపడే వారికి సహకార సంఘం చైర్మన్ లా..?
- కోర్టు నిర్ణయం ప్రకటించకుండానే చైర్మెన్ల ఎంపిక ప్రక్రియ
- పలు జిల్లాలో సహకార సంఘం చైర్మన్ ల ప్రమాణ స్వీకారం పూర్తి
- ప్రభుత్వం తీరుపై సొంత పార్టీ నాయకుల అసంతృప్తి



ప్రజా వాయిస్ సంగారెడ్డి : అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాల కాదు సొంత పార్టీ నాయకులు సైతం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడ్డ నాయకులను, కార్యకర్తలను కాదని ఇటీవల పార్టీలు మారిన వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు అప్పగించారు.... కానీ కోర్టు పరిధిలో కేసు నడుస్తున్న సహకార సంఘం చైర్మన్ ల ఎంపిక మాత్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులకు నామినేట్ పద్ధతిలో చైర్మన్ పదవులను ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాలో నామినేట్ పదవి పద్ధతిలో చైర్మన్గా ప్రకటించిన వారు కొన్ని ప్రాంతాల్లో ప్రమాణస్వీకారం ఇప్పటికే చేశారు. కానీ సంగారెడ్డి జిల్లాలో ఏ ఒక్క చైర్మన్ పదవికి కూడా ప్రమాణస్వీకారం చేసిన సందర్భాలు లేవు. దీనికి ప్రధాన కారణం హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులో సైతం సహకార సంఘం ఎన్నికల ప్రక్రియ అంశంపై కేసు విచారణలో ఉంది. కోట్లు దీనిపై ఎలాంటి తుది నిర్ణయం ప్రకటించలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన క్యాడర్లో ఉన్న అసలు తృప్తిని ఎలాగైనా తగ్గించాలన్న ఉద్దేశంతో కోర్టు పరిధిలో కేసు కొనసాగుతున్న దాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా నామినేట్ పదవులను ప్రకటించారు. ఇదే సందర్భంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ల పదవీకాలం ముగిసినందున వారి స్థానంలో కొత్తవారిని నియమించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పై సొంత కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకులే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వివాదాలు లేని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఇటీవల పార్టీలు మారిన నాయకులకు అంటగట్టి కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న సహకార సంఘం చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ చెందిన వారికి అప్పగించడం ఎంతవరకు సమంజసం అని సొంత పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడ్డ తమకు పదవులు ఇవ్వలేము అనకుండా కోర్టు వివాదంలో ఉన్న వాటిని అంటగట్టి తమను ఎటు కాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టులో సైతం గతంలో సహకార సంఘం ఎన్నికలు డైరెక్టర్ల ఎన్నికల అనంతరం వారి మద్దతు తోనే చైర్మన్ ఎన్నిక నిర్వహించేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక డైరెక్టర్ రాష్ట్రవ్యవస్థను రద్దు చేసి నామినేట్ పద్ధతిలో చైర్మన్ ఎన్నికను నిర్వహించేలా బిల్లును సవరణ చేశారు. దీన్ని కొందరు నాయకులు సవాల్ చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ ద్వారానే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని.... సహకార సంఘం అనేది రైతులు సభ్యులుగా ఉన్నందున వారు ఓటింగ్ చేయవలసి ఉంటుందని.. అందువల్ల ఓటింగ్ నిర్వహించకుండా నామినేట్ పద్ధతిలో చైర్మన్ నియమించడం చట్ట విరుద్ధమని కోర్టుకు వెళ్లారు. దీనిపై గత రెండు సంవత్సరాలుగా విచారణ కొనసాగుతుంది. ఇప్పటికీ తుది నిర్ణయం రాకపోవడంతో త్వరలో ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు వస్తున్నందున వాటిలో లబ్ధి పొందినందుకే అధికార కాంగ్రెస్ పార్టీ నామినేట్ పద్ధతిలో చైర్మన్ లను ప్రకటించిందని ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ నిర్ణయంపై అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకులు సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు.



పది గుంటల భూమికి మూడెకరాల పట్టా?

- తప్పుడు నివేదికతో భూమి బదలాయించారని ఆరోపణ
- విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితురాలి వినతి
- 4.02 ఎకరాల భూమిలో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- కేవలం 10 గుంటల భూమి ఉన్న వ్యక్తికి 3 ఎకరాలు పట్టా చేశారని ఫిర్యాదు
- తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- పెన్ పహాడ్ ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం

పెన్ పహాడ్,/ప్రజా వాయిస్ తమ వ్యవసాయ భూమిని తప్పుడు నివేదికల ఆధారంగా ఇతరుల పేరుపై అక్రమంగా పట్టా చేశారని ఆరోపిస్తూ మహమ్మదాపురం గ్రామానికి చెందిన కిన్నెర లింగమ్మ సోమవారం పెన్ పహాడ్ మండల ఎంపీడీవోకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మహమ్మదాపురం గ్రామ శివారులో తమకు 4 ఎకరాల 2 గుంటల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. అయితే కేవలం 10 గుంటల భూమి మాత్రమే ఉన్న ఓ వ్యక్తికి సంబంధిత అధికారులు 2021లో తప్పుడు నివేదికలు సమర్పించి, ఏకంగా 3 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేశారని ఆరోపించారు.తప్పుడు నివేదికల ఆధారంగా భూమి బదలాయింపులు జరగడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ పట్టా వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయాలని కోరారు.అక్రమంగా పట్టా చేసిన భూమిని రద్దు చేసి, తమ భూమిని తిరిగి తమకు అప్పగించాలని, ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కిన్నెర లింగమ్మ అధికారులను కోరారు

ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా

- అగ్రిగోల్డ్ బాధితుల్లో కొత్త ఆశలు
- ఈ నెల 25 నుంచి బాండ్ల పరిశీలనకు శ్రీకారం
- నల్లగొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు
- రోజుకు 250 మంది బాధితులకు అవకాశం
- మండలాల వారీగా షెడ్యూల్
- ఒరిజినల్ బాండ్లు, గుర్తింపు పత్రాలతో హాజరు కావాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచన



ప్రజా వాయిస్, నల్లగొండ: కష్టపడి సంపాదించిన సొమ్మును భద్రంగా దాచుకోవాలన్న ఆశతో అగ్రిగోల్డ్ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వేలాది కుటుంబాలకు ఏళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బులు తిరిగి వస్తాయన్న ఆశతో బాధితులు ఇన్నాళ్లూ నిరీక్షించారు. కొందరికి వృద్ధాప్య అవసరాలు, మరికొందరికి కుటుంబ ఆర్థిక భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో బాధితులకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ నెల 25వ తేదీ నుంచి నల్లగొండ జిల్లాలో అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏళ్ల నిరీక్షణకు పరిష్కారం లభిస్తుందన్న ఆశతో బాధితులు ఈ ప్రక్రియపై దృష్టి సారిస్తున్నారు.

రోజుకు 250 మంది బాండ్ల పరిశీలన

నల్లగొండ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (మహిళా ప్రాంగణం పక్కన)లో ప్రత్యేకంగా పరిశీలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాండ్ల పరిశీలన కొనసాగనుంది. మండలాల వారీగా కేటాయించిన తేదీల ప్రకారం రోజుకు 250 మంది బాధితుల బాండ్లను పరిశీలించనున్నారు. బాధితులు తమకు కేటాయించిన తేదీల్లోనే కేంద్రానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.65 లక్షల మంది బాధితులు

అగ్రిగోల్డ్ వ్యవహారానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.65 లక్షల మంది బాధితులు ఉన్నట్లు సీఐడీ వెల్లడించింది. సుమారు రూ.447 కోట్ల మేరకు జరిగినట్లు పేర్కొంటున్న ఈ వ్యవహారంలో బాధితుల పెట్టుబడులకు సంబంధించిన వివరాలను సేకరించి ధ్రువీకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పది ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాండ్లు, నగదు రశీదులు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధితుల క్లెయిమ్‌ల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ తదుపరి పరిహార చెల్లింపుల దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

బాధితులు అప్రమత్తంగా ఉండాలి

బాండ్ల పరిశీలనకు వచ్చే డిపాజిటర్లు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ తీసుకురావాలి. ఖాతాదారుడి పేరు, బ్యాంకు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ స్పష్టంగా ఉండాలి. డిపాజిటర్ మరణించినట్లయితే నామినీ మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు వివరాలు సమర్పించాలి. డిపాజిటర్, నామినీ ఇద్దరూ మరణించిన సందర్భంలో చట్టబద్ధ వారసులు అవసరమైన మరణ ధ్రువీకరణ పత్రాలు, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలి.

కుటుంబ సభ్యులు, ఏజెంట్లకూ అవకాశం

డిపాజిటర్ స్వయంగా రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఆయన అనుమతితో సంబంధిత పత్రాలు, కుటుంబ సంబంధాన్ని నిరూపించే ఆధారాలతో హాజరుకావచ్చు. ఏజెంట్లు కూడా బాండ్లను పరిశీలనకు సమర్పించవచ్చు. ఇందుకోసం ప్రతి బాండ్ ఒరిజినల్, కలర్ జిరాక్స్, లావాదేవీ నంబర్లు, ఏజెంట్ ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నంబర్, ఏజెంట్ కోడ్‌తో పాటు సంబంధిత ఒప్పంద పత్రాలు, రికార్డులు తీసుకురావాలి.

అసలు బాండ్ ను భద్రంగా ఉంచుకోవాలి

బాధితులు తమ అసలు బాండ్లను అధికారులకు పరిశీలన కోసం మాత్రమే చూపించాలని, వాటిని తిరిగి తీసుకోవాలని సీఐడీ స్పష్టం చేసింది. బాండ్ వివరాలు స్పష్టంగా కనిపించేలా కలర్ జిరాక్స్‌పై సంబంధిత వ్యక్తి సంతకం చేసి సమర్పించాలి. పత్రాలు అందజేసిన అనంతరం అధికారుల నుంచి రసీదు తీసుకోవడం మర్చిపోవద్దు. ఆధార్, పాన్, మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్ కూడా వెంట తీసుకెళ్లాలి.

బాధితుల ఆశలు నెరవేరేనా?

అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టిన వారిలో అనేకమంది సామాన్యులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, రైతు కుటుంబాలు ఉన్నారు. తమ భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్ము నిలిచిపోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొందరు బాధితులు మరణించగా, వారి తరపున వారసులు ఇప్పుడు తమ హక్కును నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాండ్ల పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిచేసి అర్హులైన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు. బాండ్ల ధ్రువీకరణ పూర్తయిన తర్వాత నగదు చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కావాలని బాధితులు ఆశిస్తున్నారు.

మరిన్ని వివరాలకు సంప్రదించండి:-

08682-222423- 8712670421ఎస్పీ సూచన: బాధితులు మండలాల వారీగా తమకు కేటాయించిన తేదీల్లోనే పరిశీలన కేంద్రానికి రావాలి. అవసరమైన అన్ని ఒరిజినల్ పత్రాలు, జిరాక్స్ ప్రతులు సిద్ధం చేసుకుని హాజరుకావాలి.

52	02-02-2027	250	మిర్యాలగూడ (250)
53	03-02-2027	250	మిర్యాలగూడ (250)
54	04-02-2027	250	మిర్యాలగూడ (250)
55	05-02-2027	250	మిర్యాలగూడ (114); మునుగోడు
56	06-02-2027	250	మునుగోడు (250)
57	08-02-2027	250	మునుగోడు (54); నకిరేకల్ (196)
58	09-02-2027	250	నకిరేకల్ (250)
59	10-02-2027	250	నకిరేకల్ (170); నల్గొండ (80)
60	11-02-2027	250	నల్గొండ (169); నాంపల్లి (81)
61	12-02-2027	250	నాంపల్లి (250)
62	13-02-2027	250	నాంపల్లి (250)
63	15-02-2027	250	నాంపల్లి (32); నార్కట్పల్లి (218)
64	16-02-2027	250	నార్కట్పల్లి (139); నేరెడుగొమ్ము
65	17-02-2027	250	నేరెడుగొమ్ము (144); నిడమనూరు
66	18-02-2027	250	నిడమనూరు (250)
67	19-02-2027	250	నిడమనూరు (34); పెద్ద అడిశర్ల
68	20-02-2027	250	పెద్ద అడిశర్లపల్లి (47); పెద్దవూర
69	22-02-2027	250	పెద్దవూర (250)
70	23-02-2027	250	పెద్దవూర (139); పాలిగొరారం (1
71	24-02-2027	250	పాలిగొరారం (195); తిప్పర్తి (55)
72	25-02-2027	250	తిప్పర్తి (250)
73	26-02-2027	250	తిప్పర్తి (250)
74	27-02-2027	250	తిప్పర్తి (250)
75	01-03-2027	250	తిప్పర్తి (10); త్రిపురారం (240)
76	02-03-2027	250	త్రిపురారం (250)
77	03-03-2027	250	త్రిపురారం (181); వేములపల్లి (6
78	04-03-2027	250	వేములపల్లి (250)
79	05-03-2027	250	వేములపల్లి (250)
80	08-03-2027	250	వేములపల్లి (250)
81	09-03-2027	250	వేములపల్లి (89)

అగ్రిగోల్డ్ బాధితులు గమనించాలి

నల్లగొండ కేంద్రంలో బాండ్ల పరిశీలన తేదీలు
నవంబర్ 25 నుంచి మార్చి 9 వరకు
ప్రత్యేక షెడ్యూల్
పరిశీలన కేంద్రం: జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (మహిళా ప్రాంగణం పక్కన), నల్లగొండ.
సమయం: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.
మండలాల వారీగా
పరిశీలన వివరాలు:

మండలం	తేదీలు	బాధితులు
అడవిదేవులపల్లి	నవం. 25–27	551
అనుముల	నవం. 27–డిసెం. 1	734
చందంపేట	డిసెం. 1–3	425
చందూరు	డిసెం. 3–7	726
చింతపల్లి	డిసెం. 7–9	535
చిట్యాల	డిసెం. 9–11	453
దామరచర్ల	డిసెం. 11–14	604
దేవరకొండ	డిసెం. 14–22	1,288
గట్టుప్పల్	డిసెం. 22–23	253
గుండ్లపల్లి	డిసెం. 23–28	292
గుర్రంపోడు	డిసెం. 28–30	667
కనగల్	డిసెం. 30–జన. 1	300
కట్టంగూరు	జన. 1–4	542
కేతేపల్లి	జన. 4–7	687
కొండమల్లేపల్లి	జన. 7–8	250
మాడుగులపల్లి	జన. 8–9	257
మర్రిగూడ	జన. 9–11	353
మిర్యాలగూడ	జన. 11–ఫిబ్ర. 5	7,747
మునుగోడు	ఫిబ్ర. 5–8	440
నకిరేకల్	ఫిబ్ర. 8–10	616
నల్గొండ	ఫిబ్ర. 10–11	249
నాంపల్లి	ఫిబ్ర. 11–15	613
నార్కట్పల్లి	ఫిబ్ర. 15–16	357
నేరెడుగొమ్ము	ఫిబ్ర. 16–17	255
నిడమనూరు	ఫిబ్ర. 17–19	390
పెద్ద అడిశర్లపల్లి	ఫిబ్ర. 19–20	263
పెద్దవూర	ఫిబ్ర. 20–23	592
పాలిగొరారం	ఫిబ్ర. 23–24	306
తిప్పర్తి	ఫిబ్ర. 24–మార్చి 1	815
త్రిపురారం	మార్చి 1–3	671
వేములపల్లి	మార్చి 3–9	1,089

బాధితులకు ముఖ్య సూచనలు:-

కేటాయించిన తేదీల్లోనే పరిశీలన కేంద్రానికి రావాలి.– అసలు బాండ్, కలర్ జిరాక్స్ వెంట తీసుకురావాలి.– ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్, అవసరమైన ఇతర పత్రాల ఒరిజినల్స్, జిరాక్స్ తీసుకురావాలి.– బాండ్ల పరిశీలన అనంతరం రసీదు పొందాలి.

నకిలీ డెత్ సర్టిఫికెట్ల కేసులో అసలు దోషులెవరో తేల్చాలి

- చిరుద్యోగులను బలిచేయడం సరికాదు.. ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి
- కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ స్పందించాలి
- అధికార పార్టీ నేతల ప్రమేయంపై ఆరోపణలు
- కేసీఆర్ పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు తగవు
- బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదు
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి/ప్రజా వాయిస్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెల్లంపల్లి మండలంలో వెలుగుచూసిన నకిలీ డెత్ సర్టిఫికెట్ల కుంభకోణంలో అసలు దోషులను వదిలిపెట్టి కింది స్థాయి చిరుద్యోగులను అరెస్టు చేసి జైలుకు పంపడం అన్యాయమన్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తక్షణమే స్పందించి ఈ కుంభకోణంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అసలు దోషులను కాపాడేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని, ఈ వ్యవహారంలో బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. నకిలీ డెత్ సర్టిఫికెట్ల కుంభకోణంలో అసలు దోషులను గుర్తించి చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తుంగల సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు తిరుమల వాసు, దొంగల రాజ్ కుమార్, గోగర్ల స్వప్న, రజిత, సర్పంచ్ సంగతి రాజేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, అధికార ప్రతినిధి కొమ్మర లక్ష్మణ్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయం

- ఎంఈఓ భాస్కర్ మాజీ కార్పొరేటర్ సింధు
- 14 లక్షలతో ఎల్ ఐజీ ప్రభుత్వ పాఠశాలను ఆధునికరించిన సేల్స్ ఫోర్స్ నిర్మాణ్ సంస్థలు



పటన్ చెరువు ప్రజావాయిస్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ,పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయమని రామచంద్రాపురం ఎంఈఓ భాస్కర్ భారతినగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డిలు అన్నారు భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీ కాలనీలోని ఎల్ఐజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సేల్స్‌ఫోర్స్ సంస్థ, నిర్మాణ్ సంస్థ సహకారంతో సుమారు రూ.14 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టగా, వాటిని రామచంద్రపురం ఎంఈఓ భాస్కర్ భారతినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి లు సోమవారం సంస్థ ప్రతినిధులతో కలిసి,ప్రారంభించారు.పాఠశాలలో గతంలో పైకప్పు నుంచి నీటి లీకేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో స్లాబ్ మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులు, విద్యుత్ వ్యవస్థ, ప్లంబింగ్, పెయింటింగ్, మరుగుదొడ్ల పునరుద్ధరణ మరియు ఆధునీకరణ, అవసరమైన విద్యుత్ పరికరాల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. దీంతో పాఠశాల మరింత మెరుగైన వసతులతో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది.అదేవిధంగా పాఠశాల విద్యార్థుల కోసం భోజన శాల షెడ్ నిర్మాణాన్ని కూడా త్వరలో చేపట్టి పీలైనంత త్వరగా పూర్తి చేస్తామని సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి ఎంఈఓ భాస్కర్ లు సేల్స్‌ఫోర్స్ సంస్థ మరియు నిర్మాణ్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేల్స్‌ఫోర్స్ సంస్థ తరపున సుదీప్ కంచెర్ల,వైస్ ప్రెసిడెంట్, అభినేష్ బద్దం సీనియర్ డైరెక్టర్, స్వప్న తటికొండ ప్రోగ్రామ్ మేనేజర్, పాండురంగారావు రల్లపల్లి సీనియర్ మేనేజర్ రామచంద్రపురం ఎంఈఓ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు ఎల్ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శామ్యూల్, మాజీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, శారద మహిళా మండలి అధ్యక్షురాలు వనజ, సత్యవతి, సరిత మరియు ఇతర స్థానిక నాయకులు, కాలనీ వాసులు. నిర్మాణ్ సంస్థ తరపున హరీష్, సౌమ్య, నిక్కీ, రామ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన తుర్కకాషాలు..!

- జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకోవడంపై భగ్గుమన్న సంఘం నాయకులు
- చౌటుప్పల్, నారాయణపురం ప్రధాన రహదారిపై ధర్నా
- రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్న పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుడిమల్కాపూర్ గ్రామంలో తురక కాశ సంక్షేమ సంఘం జెండా దిమ్మె ఏర్పాటు విషయంలో స్థానికంగా కొందరు ప్రజాప్రతినిధులు అడ్డంకులు సృష్టించడంపై తురక కాశ సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సంఘం జెండాను ఏర్పాటు చేసుకునే హక్కును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్,నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం రోడ్డు ప్రధాన రహదారిపై మెరుపు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ మాట్లాడుతూ, తురక కాశ సమాజం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సంఘం జెండా దిమ్మె ఏర్పాటును అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని, సమాజ ఐక్యతను దెబ్బతీసే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం తురక కాశ సమాజం ఐక్యంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు.స్థానిక ఎస్సై, సీఐలు సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చలు జరిపారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి, జెండా దిమ్మెను తామే స్వయంగా ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు అధికారుల హామీని స్వాగతించిన బడే సాబ్ ధర్నాను విరమించారు.ఈ కార్యక్రమంలో ఎస్.కె. లతీఫ్, ఇస్మాయిల్, సాహెబ్, హుస్సేన్, రఫీ, నజీర్, మొయినుద్దీన్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు యూసుఫ్ తదితర నాయకులతో పాటు భారీ సంఖ్యలో తురక కాశ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏటి కాలువ మాయం.. రైతులకు సాగునీటి గగనం.!

- చెక్ డ్యామ్ పైపులైన్లకూ అడ్డంకులు
- అధికారులకు బాధితుల ఫిర్యాదు
- ఏటి కాలువ, రహదారి ఆక్రమణకు గురయ్యాయని ఆరోపణ
- హద్దులు తేల్చి రాళ్లు పాతాలని రైతుల డిమాండ్
- ఎంపీడీవో, తహసీల్దార్ నుంచి కలెక్టరేట్ ప్రజావాణి వరకు ఫిర్యాదులు



ప్రజా వాయిస్,పెన్‌పహాడ్: రైతులకు సాగునీరు అందాల్సిన ఏటి కాలువ ఆక్రమణ ఆరోపణలతో వివాదంలో చిక్కుకుంది. చెక్‌డ్యామ్ నుంచి పొలాలకు పైపులైన్లు వేసుకునేందుకు కూడా అడ్డంకులు ఎదురవుతుండటంతో పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువతో పాటు అక్కడికి వెళ్లే దారిని ఆక్రమించారని ఆరోపిస్తూ సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌తో పాటు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

పైపులైన్లు వేయనివ్వడం లేదంటూ ఆవేదన

గ్రామంలోని చెక్‌డ్యామ్ సమీపంలో ఉన్న ఏటి కాలువ, అక్కడికి వెళ్లే రహదారిని పందిరి నాగయ్య అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. చెక్‌డ్యామ్ నుంచి తమ పొలాలకు సాగునీటి కోసం పైపులైన్లు వేసుకునేందుకు ప్రయత్నిస్తే అభ్యంతరాలు చెబుతున్నారని తెలిపారు. చెక్‌డ్యామ్, కాలువ దారి తన పట్టా భూమిలో ఉన్నాయని సదరు వ్యక్తి పేర్కొంటున్నట్లు ఫిర్యాదులో వివరించారు. దీంతో సాగునీటి అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.

హద్దులు తేల్చి న్యాయం చేయాలి

ఏటి కాలువ, రహదారి విషయంలో నెలకొన్న వివాదాన్ని అధికారులు తక్షణమే పరిష్కరించాలని రైతులు కోరారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అసలు సరిహద్దులను నిర్ధారించాలని, హద్దురాళ్లు పాతి కాలువ, దారిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తోటి రైతుల సాగునీటి అవసరాలకు అడ్డంకులు సృష్టించడం సరికాదని, సమస్య పరిష్కారం కాకుంటే పొలాల మీదుగా రాకపోకల విషయంలో తాము కూడా పునరాలోచించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి లింగయ్య, నాగయ్య, తెనాలి ఉపేందర్‌రెడ్డి, ఎల్లమ్మ, కృష్ణయ్య, కే. నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టూటౌన్ సీఐగా ఏ. రంజిత్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



రంజిత్ రెడ్డికి పోలీస్ సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఇన్‌స్పెక్టర్ ఏ. రంజిత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నల్గొండ సీసీఎస్ (CCS) విభాగంతో పాటు ఐటీ సెల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. టూటౌన్ సీఐగా విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ సోమనర్సయ్య బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఏ. రంజిత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రతతో పాటు పోలీస్–ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏ.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇచ్చోడ అభివృద్ధి పనుల పరిశీలన

- ప్రధాన రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనుల తనిఖీ
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజా వాయిస్, ఇచ్చోడ:ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రధాన రహదారి అభివృద్ధి పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి మధ్యలో చేపడుతున్న డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఇతర మౌలిక వసతుల పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఇచ్చోడ ప్రధాన రహదారితో పాటు మండలంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సెంట్రల్ లైటింగ్ వ్యవస్థతో ఇచ్చోడ పట్టణాన్ని అన్ని సౌకర్యాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.37,940 నగదు, బైక్ స్వాధీనం
- 13మందిపై కేసు నమోదు

ప్రజావాయిస్/ మర్పల్లి: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చెసిన సంఘటన సోమవారం మర్పల్లి పోలిస్ స్టేషన్ పరిధిలో జరిగింది ఎస్ఐ రావుఫ్ తెలిపిన ప్రకారం..మర్పల్లి గ్రామ శివారులోని మర్రి చెన్నారెడ్డి వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్న స్థావరంపై మర్పల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు.పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి సమయంలో వ్యవసాయ పొలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకున్నారు.ఈ దాడిలో రూ.37,940 నగదు, మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన 11 మందిలో ఇద్దరు పరారైనట్లు సమాచారం. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులందరిపైనా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పదేళ్లకే 'తుప్పు' పట్టిన భగీరథ..
తండా నెత్తిన మృత్యుఘంటిక?

- కక్కుర్తి కట్టడాలకు కళ్లెం పడేదెన్నడు?
- ప్రజాధనాన్ని కాపాడేదెవరు?
- మనుగడ లేదు అంటున్న మిషన్ భగీరథ అధికారులు
- వాడుతున్నారంటున్న తండావాసులు!
- బీటలు వారిన పిల్లర్లు, బీమ్స్
- బయటపడిన తుప్పుపట్టిన ఇనుప చువ్వలు
- నిర్మాణ నాణ్యత, అధికారుల నిర్లక్ష్యంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు?
- పాలేరులో నాణ్యతా ప్రమాణాల డొల్లతనం
- దశాబ్దం లోపే శిథిలమవుతున్న ప్రభుత్వ భవనాలు!





ప్రజా వాయిస్:ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, మంగాపురం తండా నడిబొడ్డున ఉన్న 1,20,000 లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ ట్యాంక్ ఇప్పుడు తండావాసులకు ప్రాణసంకటంగా మారింది. నిత్యం ప్రజలు, చిన్నారులు, వృద్ధులు తిరిగే ప్రాంతంలో, ఇళ్ల మధ్య ఉన్న ఈ భారీ కట్టడం కిందకు వెళ్లాలంటేనే స్థానికులు భయంతో వణికిపోతున్నారు. ట్యాంక్ బరువును మోసే కీలక పిల్లర్లు, బీమ్‌ల జంక్షన్ల వద్ద కాంక్రీట్ పెచ్చులు ఊడిపోయి, లోపలి ఇనుప చువ్వలు తుప్పుపట్టి బయటపడటం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించింది. 2016 ఆగస్టు 7న ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. అంటే పథకం ప్రారంభమై దాదాపు పదేళ్లు కావస్తోంది. సాధారణంగా ఇంజనీరింగ్ ప్రమాణాల ప్రకారం పటిష్టమైన ఆర్‌సీసీ నిర్మాణాలు దశాబ్దాలపాటు సేవలందించేలా రూపొందిస్తారు. అలాంటిది మంగాపురం తండాలోని ట్యాంక్ పరిస్థితి ఇంత త్వరగా ఎందుకు దిగజారింది? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.ఈ పరిస్థితిపై మిషన్ భగీరథ అధికారిని వివరణ కోరగా, గత జనవరిలోనే ట్యాంక్ స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. దీనిని వినియోగించవద్దని స్పష్టం చేశామని, మరో ట్యాంక్‌ను వాడుతున్నామని, లాగ్ షీట్లలోనూ 150 కెఎల్ ట్యాంక్ మాత్రమే ఉందని పేర్కొన్నారు. అయితే, అధికారులు వాడటం లేదని చెబుతుండగా.. ఈ ట్యాంక్‌ను ఇప్పటికీ వినియోగిస్తున్నారని తండావాసులు చెబుతుండటం క్షేత్రస్థాయిలో నెలకొన్న గందరగోళం, వైరుధ్యాలకు నిదర్శనంగా నిలుస్తోంది. అధికారుల మాట ప్రకారం ఈ ట్యాంక్ వాడకంలో లేకపోయినా, నిర్మాణ నాణ్యతపై తీవ్ర సందేహాలు తలెత్తుతున్నాయి. దశాబ్దాల పాటు మన్నికగా ఉండాల్సిన భారీ కాంక్రీట్ కట్టడం కేవలం పదేళ్ల లోపే ఇంతలా శిథిలావస్థకు చేరడం వెనుక నాణ్యతా లోపం ఉందా? నాటి కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, ఇంజనీరింగ్ పర్యవేక్షణ లోపానికి ప్రజాధనం బలైందా? అన్న ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు, గత జనవరిలోనే ప్రమాదకరంగా ఉందని నివేదించినప్పటికీ, ఇప్పటివరకు కూల్చివేత కాని, పక్కా భద్రతా చర్యలు చేపట్టక పోవడం యంత్రాంగం నిర్లక్ష్యాన్ని బయటపెడుతోంది. ఏ క్షణాన ఏ ముప్పు ముంచుకొస్తుందోనన్న ఆందోళనతో బతుకుతున్న తండావాసులు, ప్రమాదం జరగకముందే ట్యాంక్‌ను తొలగించాలని, పదేళ్లకే కట్టడం శిథిలమవడంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ శాశ్వత పింఛన్ కల్పించాలి

- జర్నలిస్టుల సంక్షేమ నిధి, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా మండలిలో ప్రస్తావించాలి
- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డికి వినతిపత్రం

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ శాశ్వత పింఛన్ సౌకర్యం కల్పించి, వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు సోమవారం గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల కోసం జర్నలిస్టులు కార్యక్రమంలో భాగంగా ఆయనకు వినతిపత్రం సమర్పించి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ నిధితో పాటు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మండలిలో ఈ అంశాలను ప్రస్తావించాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు దాస జగదీశ్వర్, సీనియర్ జర్నలిస్టులు సత్యనారాయణరావు, నాయిని యాదగిరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, జీవన భద్రత కోసం శాశ్వత పింఛన్ పథకం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా సంస్థలకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో 10 శాతం మొత్తాన్ని జర్నలిస్టుల పింఛన్ నిధికి కేటాయించాలని, దీనికి అదనంగా ప్రభుత్వం తనవంతుగా మరో 3 శాతం నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించాలని, మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. పెన్ను కార్మికులకు పింఛన్ సౌకర్యం అందించేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ రిపోర్టర్ నరేష్ గౌడ్ పాల్గొన్నారు.





కేకుల సందడి కాదు.. అక్షరాల పండుగ!

- ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేళ ఆయన ఆశయాలకు అక్షరాభిషేకం
- కేతిరెడ్డిపల్లిలో ఎస్ ఎస్ యూ వినూత్న కార్యక్రమం..
- జన్మదిన సంబరాల్లో సామాజిక బాధ్యతకు పెద్దపీట
- విద్యార్థులకు విద్యా కానుకల పంపిణీ

మొయినాబాద్(ప్రజావాయిస్): పుట్టినరోజంటే కేకులు కోయడం.. శుభాకాంక్షల సందడి.. వేడుకల హడావుడి.. కానీ ఓ వ్యక్తి జన్మదినాన్ని మరికొందరి భవిష్యత్తుకు బాటలు వేసే సందర్భంగా మలిస్తే ఆ వేడుకకు ప్రత్యేకమైన అర్థం ఉంటుంది. అభిమానం మాటల్లో కాదు.. ఆచరణలో కనిపించాలనే సందేశంతో మొయినాబాద్ మండలంలో సోమవారం వినూత్న కార్యక్రమం చోటుచేసుకుంది.జ్ఞాన యోధుడు, బహుజన వర్గాల ఆశాజ్యోతి, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపిన డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్యూ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యా సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు అంతమొల్ల భాస్కర్, జనరల్ సెక్రటరీ చైతన్య నేతృత్వంలో కేతిరెడ్డిపల్లి, మోత్కుపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు.సాధారణ జన్మదిన వేడుకలకు భిన్నంగా విద్యార్థుల మధ్యకు వెళ్లి వారికి ఉపయోగపడే వస్తువులను అందించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలిచింది.

ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినం.. విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు!

వేడుకల కోసం చేసే ఖర్చు కంటే భావితరాల భవిష్యత్తుకు చేసే చిన్న సహాయం ఎంతో విలువైనదనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. వ్యక్తులపై అభిమానం కేవలం మాటలకే పరిమితం కాకుండా వారి ఆశయాలను ఆచరణలో చూపినప్పుడే నిజమైన గౌరవం దక్కుతుందనే భావనకు ఈ కార్యక్రమం అద్దం పట్టింది.అక్షరాన్ని ఆయుధంగా.. విద్యను అభ్యున్నతికి మార్గంగా భావిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఎస్ఎస్యూ నాయకులు జన్మదిన వేడుకలకు సేవా స్ఫూర్తిని జోడించి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశారు.

అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి

- రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్, సీపీఐ నాయకుల ధర్నా
- తిరస్కరణకు గురైన దరఖాస్తులపై పునర్విచారణ చేపట్టాలి
- అర్హులకు న్యాయం చేయాలి



ప్రజా వాయిస్ గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హత కలిగినప్పటికీ చేయూత పెన్షన్లు మంజూరు కాకపోవడంపై బీఆర్ఎస్, సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన కొందరి దరఖాస్తులు కూడా తిరస్కరణకు గురయ్యాయని ఆరోపిస్తూ, బాధిత దరఖాస్తుదారులతో కలిసి సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, సీపీఐ ఫ్లోర్ లీడర్లు మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో సుమారు 3,500 మందికి పైగా చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 600కు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. వీటిలో అర్హత ఉన్నవారి దరఖాస్తులు కూడా ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వైట్ రేషన్ కార్డులు ఉన్నప్పటికీ కొందరికి పెన్షన్లు నిరాకరించడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేసినప్పుడు, అదే కార్డులు కలిగిన వారి పెన్షన్ దరఖాస్తులను తిరస్కరించడానికి గల కారణాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం పోలీసులు ఆందోళనకారులను కమిషనర్ వద్దకు తీసుకెళ్లగా, పెన్షన్లు రాని అర్హులైన దరఖాస్తుదారుల వివరాలు, దరఖాస్తులను ఆయనకు అందజేశారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు తాళ్ల రాజయ్య, రేఖా మహేష్, తోకల రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదమ్మ, జిల్లా సమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, కలవేని విజయలక్ష్మి , మండల శ్రీకాంత్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పెన్షన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



అలైన్‌మెంట్ మార్పు వెనుక మతలబేంటి?

- ట్రిపుల్ ఆర్ భూ బాధిత రైతుల ఆగ్రహం..కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా!
- మూడుసార్లు అలైన్ మెంట్ ఎందుకు మార్చారు?
- పాత అలైన్ మెంట్ నే కొనసాగించాలని డిమాండ్

జావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: రీజినల్ రింగ్ రోడ్ (ఆర్.ఆర్.ఆర్) నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ధర్నా అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మూడుసార్లు మార్చడానికి గల కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుల భూములను కాపాడేందుకే అలైన్‌మెంట్ మార్చారా? అంటూ ప్రశ్నించారు. సామాన్య రైతుల భూములనే సేకరించడం ఏమిటని నిలదీశారు.కొత్త అలైన్‌మెంట్‌ను రద్దు చేసి, గతంలో నిర్ణయించిన పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని కోరారు. భూములు కోల్పోతే వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.రైతుల వినతిపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ.. వారు లేవనెత్తిన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పులపై స్పష్టత ఇచ్చి, తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.



టెండర్ రద్దు చేయాలని ఎమ్మెల్యే లేఖ రాయడం సరైంది కాదు

- అధికారులు టెండర్ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలి
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

ప్రజా వాయిస్ కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన నాక్ బిల్డింగ్ టెండర్ రద్దు చేయాలని ఎమ్మెల్యే లేఖ రాయడం సరైంది కాదని,టెండర్ రద్దు చేయాలనే ఆలోచనను అధికారులు విరమించుకోవాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలో నాక్ బిల్డింగ్ కోసం మొట్టమొదటిసారి ఆర్ అండ్ బి వాళ్ళు టెండర్లు ఆహ్వానిస్తే,ఆ టెండర్లలో ఏడుగురు మాత్రమే పాల్గొన్నారని,చుంచుపల్లి మండలంలో పెడతామని మళ్లీ టెండర్ పిలిచారని అప్పుడు ముగ్గురు మాత్రమే టెండర్ లో పాల్గొన్నారని,టెండర్ విలువ రూపాయలు 7కోట్ల 48లక్షలకు ఉంటే,ఆ టెండర్ ను ఎన్.హెచ్.ఆర్.ఇన్ఫ్రా వారు 13.29%శాతానికి తక్కువ కు కోడ్ చేశారని,ఇలా కోడ్ చేయడం ద్వారా ప్రభుత్వానికి సుమారు కోటి రూపాయలు ఆదా జరిగిందని,గత నెల 27న టెక్నికల్ బిడ్ ను ఓపెన్ చేశారన్నారు.ఈ టెండర్ ను ఈ నెల 4వ తేదీన ఓపెన్ చేశారని పేర్కొన్నారు.బీటి ప్లాంట్ ఉన్నవాళ్లకే టెండర్ రావాలని కొత్త నిబంధనలను పెట్టి తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు టెండర్ ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యే తహతహలాడరాని ఆరోపించారు.ఈనెల నాలుగవ తేదీన టెండర్ ఓపెన్ చేయడమే తడవుగా టెండర్ రద్దు కోరుతూ ఎమ్మెల్యే తన లెటర్ హెడ్ ద్వారా సంబంధిత అధికారులకు 5వ తేదీన లేఖ రాయడం మంచి సాంప్రదాయం కాదని విమర్శించారు.అధికారులు సైతం తప్పుడు విధానాలు అవలంబిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.టెక్నికల్ బిడ్,ప్రైజ్ బిడ్ ఓపెన్ చేసిన తర్వాత ఏ ప్రాతిపదికన టెండర్ రద్దు చేయడానికి వెళ్తారని ప్రశ్నించారు??చట్ట ప్రకారం టెండర్ ప్రక్రియ జరగకపోతే అధికారులనైనా సరే న్యాయస్థానాలకు లాగుతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,ధనుంజయ్, రాజ్ కుమార్,వంశీ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో అక్రమ నిర్మాణంపై జీహెచ్ఎంసీ కొరడా

- ఉప్పర్ పల్లిలో రెండంతస్తుల భవనం కూల్చివేత
- భారీ పోలీసు బందోబస్తు మధ్య కొనసాగిన చర్యలు



ప్రజావాయిస్||రాజేంద్రనగర్: కోర్టు ఉత్తర్వులతో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధి ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 183 సమీపంలోని అత్తాపూర్ ప్రధాన రహదారిపై నిర్మించిన రెండంతస్తుల భవనాన్ని సోమవారం అధికారులు కూల్చివేశారు.పీఎన్ఆర్ అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ఖాళీ స్థలంలో బీఆర్ఎస్ నేత ధర్మారెడ్డి అక్రమంగా నిర్మాణం చేపట్టారంటూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు.తాజాగా హైకోర్టు ఉత్తర్వులతో జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా అత్తాపూర్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు అత్తాపూర్ ప్రధాన రహదారిపై అనుమతులు లేని నిర్మాణాన్ని తొలగించినట్లు తెలిపారు. కూల్చివేతల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జూలూరుపాడు లో నాకాబందీ

- వాహన తనకీలో పాల్గొన్న డీఎస్పీ ఆదినారాయణ

జూలూరుపాడు, ప్రజా వాయిస్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం నుండి ప్రత్యేక నాకాబందీ తనిఖీలు నిర్వహించారు.కొత్తగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో నాకాబందీ చేపట్టారు. చంద్రుగొండ క్రాస్ రోడ్, మహదేవ్ హోటల్, పాలకొల్లు క్రాస్ రోడ్, సాయిబాబా ఆలయం వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, వాహనదారుల వివరాలు, వాహన పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను నిరోధించడం, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించడమే ఈ నాకాబందీ తనిఖీల ప్రధాన ఉద్దేశమని డిఎస్పి తెలిపారు. ప్రజలు పోలీసుల తనిఖీలకు సహకరించాలని, తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. వాహన తనిఖీలో సీఐ శ్రీలక్ష్మి , ఎస్సై జీసత్ కుమార్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలతో పట్టణ ప్రజల గోస

- డివైడర్ల వద్ద మట్టి కుప్పలతో రహదారులు అస్తవ్యస్తం
- వాహనదారులు, విద్యార్థులు, ఆలయాలకు వెళ్లే భక్తులకు తప్పని ఇబ్బందులు
- ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి కుప్పలు తొలగించాలని ప్రజల డిమాండ్



ప్రజా వాయిస్, మిర్యాలగూడ:మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నా అధికార యంత్రాంగం మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పట్టణంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజాగా రోడ్ల మధ్య డివైడర్ల నిర్మాణం, పూల మొక్కల ఏర్పాటులో భాగంగా మట్టిని రహదారులపై కుప్పలుగా పోయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఒకవైపు ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు గోస పడుతుంటే, మరోవైపు పనుల నిర్వహణలో కనీస ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తమవుతోంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయాలకు వెళ్లే భక్తులు సైతం ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, తిరిగి ఇళ్లకు చేరుకునే సమయంలో రహదారులపై రద్దీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పట్టణ ట్రాఫిక్ సమస్యపై పలుమార్లు కథనాలు వెలువడినా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు చేపట్టడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలను వెంటనే తొలగించి, డివైడర్ల పనులను క్రమబద్ధంగా చేపట్టి, వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నాలుగేళ్ల తర్వాత న్యాయంపోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

- మైలార్ దేవ్ పల్లి చిన్నారి లైంగిక దాడి కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు
- బాధితుడికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం
- నిందితుడికి రూ.21 వేల జరిమానా



ప్రజా వాయిస్||రాజేంద్రనగర్: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నాలుగేళ్ల విచారణ అనంతరం నిందితుడికి కఠిన శిక్ష పడింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు మహ్మద్ యాసీన్‌కు రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల కారాగార శిక్ష విధించింది.రూ.21 వేల జరిమానాతో పాటు బాధితుడికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.2022 మార్చి 9న తీగల్‌కుంటకు చెందిన ఎని మిదేళ్ల బాలుడికి డబ్బులు ఆశ చూపి, పక్కింట్లో నివసించే మహ్మద్ యాసీన్ డైమండ్ హిల్స్ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతకుముందు నెల రోజుల క్రితం షేక్ పహాడ్ వద్ద కూడా బాలుడిపై ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించినట్లు బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 181/2022గా ఐపీసీ 377,506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6 కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ కె. నరసింహ ప్రాథమిక దర్యాప్తు చేపట్టగా, రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్ తదుపరి విచారణ పూర్తి చేసి ఎస్.సి. నంబర్ 640/2022 కింద కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.విచారణలో నేరం రుజువు కావడంతో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి టి. శ్రీనివాస్ నవంబర్ 23న నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష,రూ.21 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితుడికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకటేశ్వర్ రెడ్డితో పాటు దర్యాప్తు అధికారులు ఏసీపీ బి.గంగాధర్,అప్పటి ఇన్‌స్పెక్టర్ కె.నరసింహ, ప్రస్తుత ఎస్‌హెచ్ఓ సిహెచ్. శ్రీనివాస్‌లను రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్, ఐపీఎస్ అభినందించారు.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండానే భూమి బదిలీ జరిగిందా

- తల్లి భూమి.. భర్త పేరు మీదకు.. అక్కడి నుంచి కుమార్తెకు.. ఆపై మరొకరికి విక్రయం
- ఐదుగురు వారసుల హక్కుల సంగతేంటి
- రెండోసారి ఆర్డీవోకు ఫిర్యాదు
- తహశీల్దార్ ఎండార్స్ మెంట్ తో కొత్త ప్రశ్నలు

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: తల్లి పేరుపై ఉన్న భూమి వారసత్వ బదిలీ నుంచి వరుస విక్రయాల వరకు సాగిన వ్యవహారం రెవెన్యూ శాఖలో పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఐదుగురు వారసులు ఉండగా వారి హక్కులు, సమ్మతి, వారసత్వ ధ్రువీకరణకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే భూమి బదిలీలు జరిగాయని బాధితుడు బత్తుల రాములు ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండా తల్లి పేరుపై ఉన్న భూమిని మరణించిన వారి పేర్ల మీదకు ఎలా మార్చారన్నదే ఆయన ప్రధాన ప్రశ్న. ఈ వ్యవహారంపై రెండోసారి ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారి సూచన మేరకు నిడమనూరు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన బాధితుడికి నవంబర్ 23న జారీ చేసిన ఎండార్స్‌మెంట్ అందజేశారు. అయితే ఆ ఎండార్స్‌మెంట్‌లో పేర్కొన్న వివరాలు వివాదాన్ని మరింత ఆసక్తికరంగా మార్చాయి.

తల్లి పేరుపై 1.33 గుంటల భూమి

నిడమనూరు మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బత్తుల రాములు ఫిర్యాదు ప్రకారం.. మారుపాక రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 349లో 1.33 గుంటల భూమి ఆయన తల్లి బత్తుల పూలమ్మ పేరుపై పట్టాదారుగా నమోదై ఉంది. 2005-06, 2010-11, 2013-14 రెవెన్యూ రికార్డులతో పాటు భూ భారతి ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ ఆమె పేరే నమోదై ఉన్నట్లు తహశీల్దార్ కార్యాలయ ఎండార్స్‌మెంట్‌లో పేర్కొన్నారు. పూలమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కలిపి ఐదుగురు సంతానం ఉన్నట్లు దరఖాస్తులో వివరించారు.

భర్త పేరు మీదకు.. కుమార్తెకు విక్రయం.. ఆపై మరొకరికి

ఐదుగురు వారసులున్న కుటుంబంలో భూమి బదిలీ ప్రక్రియపై ఇన్ని ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు.. కేవలం ఫిర్యాదును పరిష్కరించి నట్లు నమోదు చేయడమే సరిపోతుందా లేక అసలు పత్రాలను పరిశీలించి నిజానిజాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



తహశీల్దార్ కార్యాలయం జారీ చేసిన J/1342/2026 నంబర్ ఎండార్స్‌మెంట్‌లోని విచారణ వివరాల ప్రకారం.. బత్తుల పూలమ్మ మరణానంతరం సక్సెషన్ ప్రక్రియ ద్వారా భూమి ఆమె భర్త బత్తుల లింగయ్య పేరు మీదకు బదిలీ అయినట్లు పేర్కొన్నారు. ఇందుకు దరఖాస్తు నంబర్ 2600684414, తేదీ 08.10.2026ను ప్రస్తావించారు. అనంతరం లింగయ్య తన కుమార్తె బత్తుల పార్వతమ్మకు 28.10.2026న సేల్ డీడ్ నంబర్ 992/2026 ద్వారా భూమిని విక్రయించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఆ తర్వాత పార్వతమ్మ బత్తుల ధర్మయ్య అనే వ్యక్తికి సేల్ డీడ్ నంబర్ 1025/2026 ద్వారా విక్రయించినట్లు వెల్లడించారు. తల్లి పేరుపై ఉన్న భూమి కొద్ది కాలంలోనే వరుస బదిలీలు, విక్రయాల ద్వారా ఇతరుల చేతుల్లోకి వెళ్లినట్లు ఈ వివరాలు తెలియజేస్తున్నాయి.

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎక్కడ

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఐదుగురు సంతానం ఉన్న కుటుంబంలో వారసత్వ బదిలీ ప్రక్రియ ఎలా చేపట్టారు? వారసులందరి వివరాలు ఏ పత్రాల ఆధారంగా నిర్ధారించారు..ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సమర్పించారా.. ఇతర వారసులకు సమాచారం ఇచ్చారా.. వారి హక్కులు, అభ్యంతరాలను పరిశీలించారా.. అన్న అంశాలపై స్పష్టత అవసరమని బాధితుడు కోరుతున్నారు. అయితే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేదనే ఆరోపణను తహశీల్దార్ కార్యాలయం ఎండార్స్‌మెంట్‌లో నిర్ధారించినట్లు లేదు. అందువల్ల వారసత్వ బదిలీకి ఉపయోగించిన అసలు దరఖాస్తు, ధ్రువపత్రాలు, విచారణ నివేదికలను బహిర్గతం చేయాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో మూడు ఎకరాలు తీసుకున్నట్లు విచారణలో ప్రస్తావన

విచారణ సమయంలో ఫిర్యాదుదారు గతంలో తల్లిదండ్రుల నుంచి మూడు ఎకరాల భూమిని వాటాగా పొందినట్లు తెలిపిన విషయాన్ని కూడా తహశీల్దార్ కార్యాలయ నివేదికలో ప్రస్తావించారు. వారసుల మధ్య, ముఖ్యంగా ఇద్దరు కుమారుల మధ్య విభేదాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే గతంలో మూడు ఎకరాలు పొందిన అంశం ప్రస్తుత వివాదాస్పద భూమిలో ఆయనకు ఉన్న చట్ట బద్ధమైన హక్కును ఎలా ప్రభావితం చేస్తుంది..దానికి సంబంధించిన పత్రాలు ఏమిటి..వాటా పూర్తిగా ఇచ్చినట్లు ఆధారాలున్నాయా.. అనే అంశాలపై కూడా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

భూ భారతి చట్టం సెక్షన్ 4(5) సూచనతో ఫిర్యాదు పరిష్కారం

తహశీల్దార్ కార్యాలయం 23.11.2026న జారీ చేసిన ఎండార్స్‌మెంట్‌లో తెలంగాణ భూ భారతి చట్టం, 2025లోని సెక్షన్ 4(5) ప్రకారం సంబంధిత సమర్థ అధికారి లేదా అప్పీల్ అధికారిని ఆశ్రయించాలని సూచించింది. ఈ కార్యాలయ పరిధిలో తదుపరి చర్యలు తీసుకునే అవకాశం లేదని పేర్కొంటూ ప్రజావాణి ఫిర్యాదును తదుపరి చర్యలు లేకుండా పరిష్కరించినట్లు తెలిపింది. అయితే బాధితుడి అసలు ప్రశ్నలకు సమాధానాలు లభించాయా.. వారసత్వ బదిలీకి ఆధారమైన పత్రాలు పరిశీలించారా.. వరుసగా జరిగిన విక్రయాల చట్ట బద్ధతపై విచారణ జరిగిందా..అన్న అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, రెండోసారి ఆర్డీవోను ఆశ్రయించినా తనకు న్యాయం జరగలేదని బత్తుల రాములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి వారసత్వ బదిలీకి ఉపయోగించిన పత్రాలు, సక్సెషన్ దరఖాస్తు, సంబంధిత విచారణ నివేదిక, రెండు సేల్ డీడ్‌ల ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. వారసుల చట్టబద్ధమైన హక్కులకు భంగం కలిగిందా లేదా అన్నది తేల్చాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వనభోజనాలను విజయవంతం చేయాలి

కమ్మ సామాజికవర్గ కుటుంబ సభ్యులంతా హాజరుకావాలి

కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం నాయకుడు నలజాల శ్రీనివాసరావు పిలుపు

ప్రజా వాయిస్,అనంతగిరి:

కోదాడలో ఈనెల 29న ఆదివారం నిర్వహించనున్న కార్తీక వనభోజనాలను విజయవంతం చేయాలని కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం నాయకుడు నలజాల శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమానికి కమ్మ సామాజికవర్గ కుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సోమవారం అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోదాడ సమీపంలోని దొరకంట వద్ద యేర్నేని వెంకటరత్నం బాబు మామిడి తోటలో వనభోజనాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజికవర్గ కుటుంబాల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మీయతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో సాతులూరి హనుమంతరావు, ముత్తవరపు కోటేశ్వరరావు, గ్రామ కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లు సుబ్బారావు, హనుమంతు లక్ష్మీనరసింహారావు, అల్లు నాగేశ్వరరావు, చుండూరి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి నగర్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై హర్షాతిరేకం

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం..

రూ.5 లక్షల జీవిత బీమా భరోసాపై కాంగ్రెస్ నాయకుల హర్షం

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

ప్రగతి నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రగతి నగర్ డివిజన్‌లోని ఏనుగుల బొమ్మ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ తాతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. ఈ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామస్తుల సమస్యపై స్పందించిన తహసీల్దార్ అన్వర్

పెద్దవేడు గ్రామపంచాయతీకి 24 గుంటల భూమి కేటాయింపు

ఇళ్లు కోల్పోయిన వారికి కూడా స్థలాలు ఇస్తామని హామీ

(ప్రజా వాయిస్ షాబాద్)

షాబాద్ మండల పెద్దవేడు గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, పాఠశాల స్థలం తదితర సమస్యలపై ప్రజా వాయిస్‌లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు.ఈ నేపథ్యంలో ఎమ్మార్వో అన్వర్ సోమవారం ఉదయం గ్రామానికి చేరుకుని యాప చెట్టు కింద గ్రామస్తులతో కూర్చొని వారి సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నంబర్ 147లో ఉన్న భూమిలో 24 గుంటల స్థలాన్ని గ్రామపంచాయతీకి కేటాయిస్తామని ఎమ్మార్వో అన్వర్ హామీ ఇచ్చారు. గ్రామస్తులు తమ అవసరాల దృష్ట్యా ఒక ఎకరం భూమి కేటాయించాలని కోరగా, ప్రస్తుతం 24 గుంటలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని, అదనపు భూమి అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చక్కటి రాజ సులోచన రెడ్డి, వార్డ్ సభ్యులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పెద్దపీట

ప్రగతి నగర్‌లో రూ.55 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

నిజాంపేట్: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు.నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద సుమారు రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా గత 12 ఏళ్లుగా కోట్లాది రూపాయల నిధులతో ప్రగతి నగర్‌తో పాటు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సాబేర్ అలీ, వాటర్ వర్క్స్ జీఎం నాగ పరిమళ, డీఎం రజినీకాంత్ రెడ్డి, మేనేజర్ భాస్కర్, మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రగిరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డి, మహిళా అధ్యక్షురాలు అర్పితా ప్రకాష్, సీనియర్ నాయకులు శ్రీకర్ గుప్తా, చంద్రయ్య, తోట బిక్షపతి, జస్వంత్, స్వామి, రామకృష్ణ రెడ్డి, కృష్ణ, అహ్మద్, జయరాజ్, మహిళా నాయకురాళ్లు కృష్ణ మంజరి, లలితా రెడ్డి, అంజలి, భారతి, శోభ, యశోద తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమకు విలువ లేదా..?
పెన్నారు కంపెనీ ముందు హక్కుల పోరు!

బోపోల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా..

అర్హులైన కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు, రూ.30 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్

ప్రజా వాయిస్/మోమిన్ పేట్

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండల పరిధిలోని వెల్చాల్ మొరంగ పల్లి పరిధిలోని పెన్నారు కంపెనీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బోపోల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏళ్ల తరబడి కంపెనీ అభివృద్ధికి తమ శ్రమను ధారపోస్తున్న కార్మికులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఈ సందర్భంగా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికుల సమస్యలపై బోపోల్లా విజయ్ కుమార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ధర్నాకు నాయకత్వం వహించారు. కార్మికుల హక్కుల సాధన కోసం వారి పక్షాన నిలబడి యాజమాన్యాన్ని డిమాండ్లపై



నిలదీశారు. కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం, న్యాయమైన వేతనం అందాల్సిందేనని స్పష్టం చేశారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లు:

1. అర్హులైన ప్రతి కార్మికుడికి శాశ్వత ఉద్యోగం కల్పించాలి.
2. ప్రతి కార్మికుడికి నెలకు రూ.30 వేల వేతనం చెల్లించాలి.
3. ప్రతినెలా నిర్ణీత సమయానికి వేతనాలు ఇవ్వాలి.
4. కార్మికులకు సకాలంలో బోనస్ చెల్లించాలి.
5. ప్రతి సంవత్సరం వార్షిక వేతన పెంపు కల్పించాలి.

కార్మికుల చెమట చుక్కలతో లాభాలు ఆర్జించే కంపెనీలు వారి హక్కులు, సంక్షేమం విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయని నాయకులు ప్రశ్నించారు. కార్మికుల సమస్యలను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా యాజమాన్యం వెంటనే స్పందించాలని, డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బోపోల్లా విజయ్ కుమార్ స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో వెల్చాల్ సర్పంచ్ శ్రీనివాస్, మొరంగపల్లి సర్పంచ్ అరుణ బిచ్చయ్య, రైతు నాయకుడు పి. రఘురాం రెడ్డి, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం బిజెపి మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి , కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్ శ్రీశైలం తదితరులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు.

సిలువ గుట్టపై మొరం తవ్వకాలు ఆపాలి

గోదాములకు స్థలం పేరుతో మొరం దందా

పర్యావరణానికి తీవ్ర హాని

తవ్వకాలు ఆపకపోతే తీవ్ర ఆందోళన చేస్తాం

న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ హెచ్చరిక

కలెక్టర్ కు వినతిపత్రం అందజేత

ప్రజా వాయిస్ లక్షెట్టిపేట

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని సిలువ గుట్టపై మొరం తవ్వకాలు ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 60లో సిలువగుట్టపై మొరం త్రవ్వకాలను ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ,సిల్వావా గుట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ.... లక్షట్టి పేట మున్సిపాలిటీ పరిధిలోని మోదెల శివారు సర్వే నంబరు 60లోనీ సిలువ గుట్టను త్రవ్వి ప్రభుత్వ గోదాముల పేరుతో మొరం దందా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎల్ నీనో ప్రభావం వల్ల నీటి ఎద్దడి ఏర్పడుతోందని, గుట్టలను తవ్వి భూగర్భ జలాలు లేకుండా అడుగంటుపోయే పరిస్థితి ఉందని, త్రాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిలువ గుట్ట పక్కనే నాలుగు వేల మంది విద్యార్థులకు తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మైనింగ్ ఆపరేషన్ కు ప్రైవేటు



వ్యక్తులైనా, ప్రభుత్వ భూములైన గుట్టను తీస్తున్నప్పుడు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, రాష్ట్ర కాలుష్య నివారణ మండలి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పర్యావరణం కాలుష్యం మండలి అనుమతులు లేకుండానే జిల్లా మైనింగ్ అధికారులు గుట్ట తవ్వకాలను అనుమతించారని మండిపడ్డారు. సిలువగుట్ట రెవెన్యూ పరిధిలోనిదని మైనింగ్ అధికారులు వాదిస్తున్నారు కానీ చిత్తారి హేమచంద్ర కు ఇచ్చిన అనుమతుల పత్రంలో ఎక్కడ గుట్ట అనేది లేదన్నారు. కేవలం మట్టి తవ్వకంగానే చూపించి గుట్టను ధ్వంసం చేస్తున్నారన్నారు. మట్టి వేరు గుట్టవేరని కలెక్టర్ వాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టను ధ్వంసం చేయటం అంటే పర్యావరణాన్ని ధ్వంసం చేయడమే ఈ మట్టిని తొలగించి ప్రభుత్వానికి ఎంత ఇచ్చారని, ఎంత తీశారనే లెక్కలే లేవన్నారు. ఈ గుట్టను పెద్ద పెద్ద యంత్రాలతో ధ్వంసం చేసి మట్టిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారని, మట్టి దందా మాఫియా నడుస్తుందన్నారు. గోదాములకు ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాలు లేదా కొనుగోలు చేయవచ్చు కానీ సహజ సిద్ధమైన, పర్యావరణాన్ని కాపాడే గుట్టను ధ్వంసం చేయటమంటే మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా చేయటమే, పర్యావరణ ధ్వంసం కాలుష్యం నివారణ కారకాలను పెంచడం వలన రుతుపవనాలు క్రమం తప్పి ఉష్ణోగ్రతలు పెరిగి ఎల్ నినో పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనేక మార్లు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ, సిలువ గుట్ట పరిరక్షణ ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, సిలువ గుట్టను ధ్వంసం చేసి పర్యావరణాన్ని పాడు చేస్తున్న విధానాలను ఆపాలని పర్యావరణ నివారణ సంస్థల అనుమతులు లేకుండా చేస్తున్న తవ్వకాలను ఆపాలని, ఈ ప్రాంతంలో జీవిస్తున్న రైతాంగానికి, విద్యార్థిలోకానికి భూగర్భ జలాలు రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఎంతైనా ఉందని పిలుపునివ్వడం జరిగింది . లేనియెడల లక్షెట్టిపేట ప్రాంతంలో ఉన్న రైతులనుఏకంచేసి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చే విధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిలువగుట్ట పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్ దినేష్, మనోహర్, జయరాజు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్ కుమార్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు టి. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. బ్రహ్మానందం, ఎచ్ఆర్ఎఫ్ నాయకులు రెడ్డి మల్ల ప్రకాశం, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు తిరుపతి రెడ్డి, మేకల రామన్న, ఏఐకేఎంఎస్ దొండ ప్రభాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహా పాదయాత్రను జయప్రదం చేయండి...

- ఈ నెల 25 ఛలో ' సిద్దిపేట'

- భారీగా కార్యకర్తలు తరలిరావాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేష్ గౌడ్

ప్రజా వాయిస్ /దుబ్బాక :

నెల 25వ తేదీన సిద్దిపేట పట్టణంలో నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రకు మాజీ జాతీయ అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు జె.పి. నడ్డా ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ మాట్లాడుతూ... బీజేపీ మహా పాదయాత్ర కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి



ఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో దుబ్బాక మున్సిపల్ ఇన్‌చార్జి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు మల్లన్నగారి బిక్షపతి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుమల రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ భవానీ కనకరాజు, 8వ వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్, దిశ బోర్డు మెంబర్ సుంకు ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ రాజశేఖర, కొండె ఎల్లారెడ్డి, చేనేత సెల్ రాష్ట్ర నాయకులు గాజుల భాస్కర్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వనం యాదయ్య, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు ఉపేందర్ ముదిరాజ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గట్టు ప్రసాద్, బూత్ అధ్యక్షులు చెరుకూరి శ్రీశైలం, సంజయ్, సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు తొగుట రవీందర్, ఎం. రమణారెడ్డి, నిమ్మ యాదగిరి, ఈ. యాదగిరి, 19వ వార్డు ఇన్‌చార్జి ఉదయాకర్, 11వ వార్డు ఇన్‌చార్జి ప్రవీణ్, 12వ వార్డు ఇన్‌చార్జి చంద్రకాంత్, బీజేవైఎం నాయకులు పల్లె నేహాల్ గౌడ్, పల్లె మనోజ్ గౌడ్, ఎస్సీ మోర్చా మున్సిపల్ అధ్యక్షులు టైగర్ రాజు, ఓబీసీ మోర్చా నాయకులు పరశురాములు యాదవ్, నరేష్ రెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు టిజిఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు

- ఆరు పుణ్యక్షేత్రాలు.. ఏడు ఆలయాల సందర్శన
- డిసెంబర్ 1 నుంచి నాలుగు రోజుల ఆధ్యాత్మిక యాత్ర
- పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.4 వేలు టికెట్ ధర
- ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలి
: డిపో మేనేజర్ బద్రి నారాయణ

ప్రజా వాయిస్ సిద్ధిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అరుణాచల గిరి ప్రదక్షిణతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శనకు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ డిపో నుంచి టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. డిసెంబర్ 1 నుంచి నాలుగు రోజుల పాటు సాగే ఈ యాత్ర కోసం సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు డిపో మేనేజర్ బద్రి నారాయణ తెలిపారు. డిసెంబర్ 1న గజ్వేల్ నుంచి బయలుదేరి, 4న రాత్రికి తిరిగి చేరుకుంటుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా అలంపూర్‌లోని అష్టాదశ శక్తిపీఠం శ్రీ జోగుళాంబ అమ్మవారి ఆలయం, ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయాలను సందర్శించనున్నారు. అనంతరం అరుణాచలంలోని శ్రీ అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో దైవదర్శనం చేసుకొని గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు. కాంచీపురంలోని శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయం, శ్రీ వరదరాజ పెరుమాళ్ ఆలయంతో పాటు తిరుత్తణిలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు. యాత్రలో పాల్గొనేందుకు పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.4 వేలు టికెట్ ధరగా నిర్ణయించారు. ఈ ధరలో దైవదర్శనం కూడా కలిపి ఉంటుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు తమకు అవసరమైన ఆహారం, వ్యక్తిగత మందులను స్వయంగా సమకూర్చుకోవాలని సూచించారు. ముందుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికి సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అరుణాచల దైవదర్శనం, గిరి ప్రదక్షిణతో పాటు ఇతర పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే భక్తులు ముందస్తుగా రిజర్వేషన్లు చేసుకోవాలని బద్రి నారాయణ కోరారు. బుకింగ్, ఇతర వివరాల కోసం 7386367677, 9963090665 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



హత్య జరిగిన 12 గంటల్లోనే కేసు ఛేదించిన గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు...

- వేగవంతమైన దర్యాప్తుతో నిందితుల అరెస్ట్..
- హత్యకు పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలే కారణం
- పెద్దపల్లి డీసీపీ బి. రామారెడ్డి వెల్లడి

ప్రజా వాయిస్ గోదావరిఖని
పవర్‌హౌస్ కాలనీలోని శివాలయం సమీపంలో ఆదివారం జరిగిన దారుణ హత్య కేసును వన్‌టౌన్ పోలీసులు కేవలం 12 గంటల వ్యవధిలోనే ఛేదించారు. వేగవంతమైన దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలే హత్యకు కారణమని పెద్దపల్లి డీసీపీ బి. రామారెడ్డి వెల్లడించారు. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలోని శివాలయం సమీపంలో ఆదివారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, పోలీసు సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యక్తిగత కక్షలు, పాత వివాదాల కోణంలో విచారణ చేపట్టారు.



నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలను సేకరించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో హత్య జరిగిన కొద్ది గంటల్లోనే నిందితులను గుర్తించారు. నవంబర్ 22న జరిగిన హత్య ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టగా, నవంబర్ 23న తెల్లవారుజామున సుమారు 1.10 గంటల సమయంలో రాజశేఖర్‌పై జరిగిన దాడికి సంబంధించిన వివరాలను సేకరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, పాత కక్షలు, వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఒక కారు (నంబర్: ఎ+-22-ఎ-2866), పెద్ద కత్తి, చిన్న కత్తి, మూడు సెల్‌ఫోన్లు, రక్తపు మరకలున్న టీషర్టు ఉన్నాయి. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని డీసీపీ తెలిపారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వ్యక్తిగత కక్షలు, వివాదాలను హింసాత్మక ఘటనల వరకు తీసుకెళ్లకుండా చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు
హత్య జరిగిన కొద్ది సమయంలోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వన్‌టౌన్ సీఐ లింగమూర్తి, ఎస్సై మనోహర్, హెడ్ కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్ బి. ప్రకాష్, ఇతర పోలీసు సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ బి. రామారెడ్డి అభినందించారు.

ప్రొబేషనరీ డీఎస్పీలకు పోలీస్ విధులపై దిశానిర్దేశం చేసిన వరంగల్ సీపీ ఎన్.శ్వేత

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
ఇటీవల డీఎస్పీల నియామకాల్లో ఎంపికైన వారిలో ఐదుగురు ప్రొబేషనరీ డీఎస్పీలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 వారాల పాటు నిర్వహించనున్న ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సీపీ ప్రొబేషనరీ డీఎస్పీలతో మాట్లాడి, శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ శాఖ పనితీరుపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, నేరాల దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో నేర్చుకోవాలని దిశానిర్దేశం చేశారు.



పోలీస్ అధికారి విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత అత్యంత ముఖ్యమని, చట్ట పరిధిలో పనిచేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కల్పించే విధంగా ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సీపీ సూచించారు.

సీపీని కలిసిన ప్రొబేషనరీ డీఎస్పీలలో ధారావత్ సభిత, పల్లేటి సాయి ప్రత్యూష్ రెడ్డి, బుషిరెడ్డి శంతన్ కుమార్ రెడ్డి, రావిరాల యశశ్విని, జేరిపోతుల ఆంజనేయులు ఉన్నారు.

రామప్ప వారసత్వ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

కళలు, సంస్కృతి, చారిత్రక సంపదను భావితరాలకు అందించాలి: నిర్వాహకులు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:
రామప్ప (పాలంపేట), నవంబర్ 23:/
ప్రపంచ వారసత్వ వారోత్సవాలను పురస్కరించుకుని చారిత్రక రామప్ప దేవాలయ ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. భారత పురావస్తు సర్వేక్షణ శాఖ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో నవంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ పోటీల్లో పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని తమ చిత్రలేఖన ప్రతిభను చాటుకున్నారు. ఈ ఏడాది వారోత్సవాల సందర్భంగా రూపొందించిన 'వారసత్వం కోసం కళాకారులు'అనే ఇతివృత్తంతో పోటీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్ ఎ. భానుప్రసాద్ విజేతలకు బహుమతులు



అందజేశారు. ప్రథమ బహుమతిని బి. అవినాష్, ద్వితీయ బహుమతిని డి. వర్షిత, తృతీయ బహుమతిని డి. వరుణ్ సాధించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

చారిత్రక సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత:
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, మన చరిత్ర, కళలు, సంస్కృతి, సంప్రదాయాల పట్ల చిన్ననాటి నుంచే అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాల ద్వారా వారసత్వ సంపద పరిరక్షణపై విద్యార్థుల్లో ఆసక్తి కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ సాయి కృష్ణ ఈశరపు, సీనియర్ పరిరక్షణ సహాయకుడు అజిత్ ఎం.ఎస్., జీపీఓ బి. సురయ్య, అటెండర్ పి. శంకర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్, ఉపాధ్యాయులు భాను ప్రకాష్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.





ఇంటర్ బోర్డు రద్దు ప్రతిపాదనను ప్రజల ముందుంచాలి

అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి
యుఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్
చింతల్: ఇంటర్ బోర్డు రద్దు ప్రతిపాదనపై ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవద్దని యుఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు, మేధావుల అభిప్రాయాలు సేకరించిన తర్వాతే ముందుకు వెళ్లాలని కోరారు.యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చింతల్‌లోని భాగ్యరధి జూనియర్ కళాశాలలో 'ఇంటర్ బోర్డు రద్దు – తెలంగాణ విద్యపై ప్రభావం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు రద్దు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, ఫీజుల భారం, స్కాలర్‌షిప్‌లు, బస్‌పాస్‌లు, పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని సూచించారు. హడావుడి నిర్ణయాలతో విద్యార్థులకు నష్టం కలగకుండా అన్ని వర్గాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో యుఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు అరుణ్ కుమార్, ప్రజాతంత్ర బాధ్యులు చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్, కార్యదర్శి వెంకటేష్, సహాయ కార్యదర్శి ధర్మతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి: కేడం లింగమూర్తి

ప్రజా వాయిస్, హుస్నాబాద్:
పర్యావరణ పరిరక్షణతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న సెట్విన్ శిక్షణ కేంద్రంలో జూట్ బ్యాగుల తయారీపై నూతన శిక్షణ బ్యాచ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని అన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. మహిళలు జూట్ బ్యాగుల తయారీలో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, నిరుద్యోగ మహిళలు ఇటువంటి శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెట్విన్ హుస్నాబాద్ ఇన్‌చార్జ్ మహమ్మద్ కరీముద్దీన్ పాల్గొన్నారు.



కల్పన కుటుంబానికి కొట్టాల యాదగిరి ఆర్థిక సాయం

- వైద్యం పొందుతూ మహిళ మృతి చెందడం బాధాకరం
- ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపు
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

ప్రజా వాయిస్ సిద్ధిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :
ప్రసవం కోసం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన నిరుపేద ముదిరాజ్ మహిళ పసుల కల్పన కుటుంబాన్ని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గజ్వేల్‌లోని ఆర్వీఆర్ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యం పొందుతూ కల్పన మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. కల్పన మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న కల్పన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మానవతా దృక్పథంతో దాతలు, సామాజిక సేవాభావం కలిగినవారు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి తలారి భిక్షపతి ముదిరాజ్, నాయకులు లింగ సత్యనారాయణ ముదిరాజ్, దుర్గి అనిల్ ముదిరాజ్, పసుల వెంకటేష్ ముదిరాజ్, నందు యాదవ్, భాను నాయిని, భాను పాల్గొన్నారు.



జంగవానిగూడెంలో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటుకు బాలవికాస గ్రీన్ సిగ్నల్

రూ.2.80 లక్షలతో గంటకు 500 లీటర్ల స్వచ్ఛమైన తాగునీటి సరఫరా

80 శాతం నిధులు సంస్థవే.. 20 శాతం గ్రామస్తుల భాగస్వామ్యం

ప్రజా వాయిస్, కొత్తగూడ:

గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు బాలవికాస స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. మండలంలోని జంగవానిగూడెం గ్రామంలో సుమారు రూ. 2.80 లక్షల వ్యయంతో గంటకు 500 లీటర్ల సామర్థ్యం కలిగిన శుద్ధజల ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ ఆమోదం తెలిపింది. గ్రామ సర్పంచ్ గొంది సోనీ రాజు చేసిన దరఖాస్తు మేరకు సంస్థ ప్రతినిధులు గ్రామంలోని బోరు నీటిని సేకరించి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నివేదిక ఆధారంగా గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్లాంట్ మంజూరు వివరాలను వెల్లడించారు. మొత్తం వ్యయంలో 80 శాతం నిధులను సంస్థ సమకూర్చనుండగా, మిగిలిన 20 శాతం వాటాగా సుమారు రూ. 60 వేల నిధులను గ్రామస్తులు సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొంది సోనీ రాజు మాట్లాడుతూ కలుషిత నీటి వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తమ విజ్ఞప్తికి స్పందించి ప్లాంట్ మంజూరు చేసిన బాలవికాస సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ వినోద్, కార్యదర్శి శ్రీకాంత్, ఉపసర్పంచ్ అల్లెం మహేందర్, గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

పిల్లుట్ల రఘు, బీఆర్ఎస్ నాయకులు

ప్రజా వాయిస్ । హుజూర్ నగర్ ।నవంబర్ 23



పేదల జీవితాల్లో విద్యా వెలుగులు నింపిన బహుజన ఆశాజ్యోతి, విద్యా విప్లవకారుడు మాజీ ఐపీఎస్ అధికారి మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నేతలు, అభిమానులు, స్వేరోస్ శ్రేణులు ఆయనకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు.సమాజంలో చదువు యొక్క ప్రాముఖ్యతను చాటిచెబుతూ గురుకులాల ద్వారా ఎంతోమంది నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తిత్వం ప్రవీణ్ కుమార్‌దని అభిమానులు కొనియాడారు. అత్యున్నతమైన ఐపీఎస్ అధికారిగా సేవలందించిన తర్వాత, ప్రజాసేవే పరమావధిగా ఆయన రాజకీయాల్లోకి రావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు నిరుపేదల గొంతుకగా నిలుస్తున్న ఆయన ఆశయాలు, ఆశీస్సులు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజా సేవలో మరింత ముందుండాలని అభిమానులు, పార్టీ కార్యకర్తలు మనసారా కోరుకుంటూ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు



జైపూర్ మండలంలో బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి :దుర్గం అశోక్

గ్రామ, బూత్ స్థాయి కమిటీలతో పార్టీని మరింత పటిష్టం చేయాలి

జైపూర్ ప్రజా వాయిస్ :

జైపూర్ మండల కేంద్రంలో మండల ఇన్‌ఛార్జి మంత్రి రామయ్య ఆధ్వర్యంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెన్నూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి గ్రామ, బూత్, మండల కమిటీలు కష్టపడి పనిచేయాలని దుర్గం అశోక్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని, కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశం సందర్భంగా పౌనూర్ గ్రామానికి చెందిన జాడి మహేందర్, జాడి శ్రీకాంత్, శ్రీరామ్‌తో పాటు పలువురు యువకులు బీజేపీలో చేరారు. దుర్గం అశోక్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మంత్రి సురేఖ, సంజీవరావు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మధురాజ్, పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపద వేళ అభాగ్యులకు అండ.. సిద్దూర్‌లో 'ఇందిరమ్మ బీమా'కు శ్రీకారం

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

భైంసా మండలం సిద్దూర్ గ్రామంలో ఘనంగా పథకం ప్రారంభం

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద,శ్రామిక కుటుంబాలకు ఇంటి పెద్దదిక్కును కోల్పోవడం కంటే పెద్ద విషాదం మరొకటి ఉండదు.అలాంటి అనుకోని ఆపద ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయి, రోడ్డున పడే దుస్థితి నెలకొంటుంది.గ్రామీణ జనజీవనంలోని ఈ కఠిన వాస్తవాలను,ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



ప్రవేశపెట్టిన'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథక' సోమవారం భైంసా మండలం సిద్దూర్ గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది.సిద్దూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం,కూలీ పనులపై ఆధారపడి జీవించే కుటుంబాలకు జీవిత బీమా ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు.కష్టకాలంలో కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలబడి,వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఈ పథకంలో నమోదు చేసుకుని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దూర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న 'ప్రజా ట్రస్ట్'.. లోకేశ్వరంలో పేద విద్యార్థులకు 'ఆల్ ఇన్ వన్' అండ!

ఆరు ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

గతేడాది ఇచ్చిన హామీని నేడు ఆచరణలో పెట్టిన చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్

గ్రామీణ ప్రభుత్వ బడుల విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భరోసా

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు పరీక్షల సమయంలో స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయడం ఒక పెద్ద ఆర్థిక భారం.ముఖ్యంగా పదో తరగతి,ఇంటర్మీడియట్ వంటి కీలక మలుపుల్లో సరైన పుస్తకాలు లేక ఎందరో గ్రామీణ విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు.ఇలాంటి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి బాసటగా నిలుస్తూ,గత ఏడాది తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు ప్రజా ట్రస్ట్ చైర్మన్ శ్రీ భోస్లే మోహన్‌రావు పాటిల్.సోమవారం లోకేశ్వరం మండలంలోని మొత్తం ఆరు ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10వ తరగతి విద్యార్థులకు'ఆల్ ఇన్ వన్' పుస్తకాలను, ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టడీ



మెటీరియల్‌ను ఆయన స్వయంగా పంపిణీ చేశారు.మండలంలోని గడ్చంద జెడ్పీహెచ్ఎస్, పిప్రి,రాజురా, మాన్మద్ గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు లోకేశ్వరంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (ఖ+దీఎ) 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆయన తన చేతుల మీదుగా ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు.

హామీని నెరవేర్చిన వేళ ఇంటర్ విద్యార్థుల హర్షం:

గత ఏడాది మండలంలో పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన సందర్భంగా, లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల (11, 12 తరగతులు) విద్యార్థులకు కూడా స్టడీ మెటీరియల్ అందిస్తానని మోహన్‌రావు పాటిల్ హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం నేడు స్వయంగా జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్థులకు మెటీరియల్ అందజేయడంతో అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భోస్లే మోహన్‌రావు పాటిల్ విద్యార్థులతో మాట్లాడుతూ.. పదో తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాళ్లని పేర్కొన్నారు.గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యా వనరులు అందించడమే ప్రజా ట్రస్ట్ ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యతోనే గ్రామీణ అభివృద్ధి సాధ్యమన్న ఆశయంతో ప్రజా ట్రస్ట్ అందిస్తున్న ఈ విద్యా సేవలపై ఆయా గ్రామాల ప్రజలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆయా కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమాపై ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారా?

- ఇంటి పన్ను రసీదు తప్పనిసరి అంటూ పెద్దకల్వల పంచాయతీ పాలకవర్గంపై ఆరోపణలు..

- ఎంపీడీఓకు ఫిర్యాదు చేసి విచారణ కోరుతాం: గుండేవేన స్వామి

ప్రజా వాయిస్ పెద్దపల్లి

పేద కుటుంబాలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా పథకంపై పెద్దకల్వల గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ పెద్దపల్లి జిల్లా సీనియర్ నాయకులు గుండేవేన స్వామి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు రైతు



బీమా అమలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ బీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ వివరాలు అందించాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. అయితే పెద్దకల్వల గ్రామంలో ఇంటి నంబర్, ఇంటి పన్ను చెల్లింపు రసీదు తప్పనిసరిగా తీసుకురావాలంటూ గ్రామ పంచాయతీ నుంచి ప్రజలకు సందేశాలు పంపుతున్నారని ఆయన ఆరోపించారు. పథకం నిబంధనల్లో లేని అంశాలను తప్పనిసరి అంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఇంటి పన్ను చెల్లించకపోతే పథకానికి అర్హత ఉండదనే భావనతో పేద ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, ఈ వ్యవహారంపై సమగ్ర స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పథకం పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ఎంపీడీఓకు అధికారికంగా ఫిర్యాదు చేసి, గ్రామ పంచాయతీ నుంచి పంపిన సందేశాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తామని గుండేవేన స్వామి వెల్లడించారు.

హుస్నాబాద్‌లో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసుల దాడులు..

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజా వాయిస్ హుస్నాబాద్,



హుస్నాబాద్ పట్టణంలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఆదేశాల మేరకు సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ పి. లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బంది కలిసి గత రాత్రి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో వ్యభిచార కార్యకలాపాలతో సంబంధం ఉన్న వ్యక్తులను పోలీసులు గుర్తించారు. నిర్వాహకురాలు కంసాని అనిత, కంసాని రాము, విటుడిపై ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్ – 1956 (ITPA/PITA) కింద సంబంధిత సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.వ్యభిచార కార్యకలాపాలు నిర్వహించడం, బ్రోతల్ నిర్వహణలో భాగస్వామ్యం కావడం, వ్యక్తులను వ్యభిచారంలోకి ప్రలోభపెట్టడం లేదా తీసుకురావడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్టంలోని నిబంధనల ప్రకారం విటులు, ఇతర సంబంధిత వ్యక్తులపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.హుస్నాబాద్ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని సీఐ శ్రీధర్ తెలిపారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసినట్లయితే ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.



పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం

ఆత్మనగర్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్రం-2 ప్రారంభం

108 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు వెల్లడి

ప్రజా వాయిస్, మెట్‌పల్లి:

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు అన్నారు. సోమవారం ఆత్మనగర్‌లో నూతన అంగన్‌వాడీ కేంద్రం--2ను ప్రారంభించి, అనంతరం మెట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో 108 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. చిన్నారులకు మెరుగైన విద్య, పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయనన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాలం కోసం ఎదురుచూడడు కరెంటు కోసం పడిగాపులు వర్షం కోసం ఆకాశం వైపు చూపులు అయినా సాగు ఆపని రైతన్న

ప్రకృతి సహకరించకపోయినా.. ప్రభుత్వ హామీలపై ఎదురుచూపులున్నా నారు పోసి నూతన ఆశలతో వ్యవసాయానికి శ్రీకారం

కష్టాలే ఎదురైనా నష్టాల భయం వెంటాడినా నేలతల్లిని నమ్ముకుని ముందుకు సాగుతున్న అన్నదాత

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం

నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం రైతు జీవితం అంటేనే ఓ యుద్ధం ప్రతి సీజన్ ఓ సవాల్ ప్రతి పంట ఓ ఆశ ప్రతి విత్తనం వెనుక ఓ కుటుంబ భవిష్యత్తు దాగి ఉంటుంది. వేసవి కాలం కాకపోయినా, సరైన సాగు సమయం కాదని తెలిసినా రైతన్న మాత్రం నారు పోసి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. కాలం అనుకూలిస్తుందో లేదో తెలియదు వర్షం కురుస్తుందో లేదో తెలియదు బోర్లలో నీరు ఉంటుందో లేదో తెలియదు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా వ్యవసాయానికి కరెంటు సక్రమంగా అందుతుందో లేదో తెలియదు. అయినా రైతు ఆశ మాత్రం చావడం లేదు.ఒకవైపు ప్రకృతి పరీక్షలు మరోవైపు విద్యుత్ సమస్యలు ఇంకోవైపు సాగునీటి కొరత వీటన్నింటి మధ్య రైతన్న వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాడు. పగలు పొలంలో కష్టపడుతూ రాత్రి కరెంటు కోసం ఎదురుచూస్తూ ఎప్పుడు వర్షం పడుతుందా అని ఆకాశం వైపు చూస్తూ కాలం గడుపుతున్నాడు.రైతుకు వ్యవసాయం అంటే కేవలం ఓ వృత్తి కాదు అది బతుకుదెరువు అది కుటుంబానికి అన్నం పెట్టే మార్గం అది తరతరాలుగా వస్తున్న జీవన పోరాటం. పంట పండితే అప్పులు తీరుతాయనే ఆశ నాలుగు రూపాయలు మిగులుతాయనే నమ్మకం అదే రైతును మళ్లీ మళ్లీ పొలం బాట పట్టిస్తోంది.ప్రభుత్వాలు రైతులకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. కానీ ఆ హామీలు క్షేత్రస్థాయిలో అమలై, సాగు సమయంలో రైతుకు అవసరమైన విద్యుత్, నీరు సకాలంలో అందినప్పుడే నిజమైన రైతు సంక్షేమం సాధ్యమవుతుంది. రైతు నారు పోసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రతి అడుగులోనూ ప్రభుత్వ సహకారం అవసరం.కాలం రైతును ఆపలేకపోతోంది.. కరెంటు కష్టాలు రైతు ఆశను చంపలేకపోతున్నాయి ప్రకృతి పరీక్షలు రైతు పట్టుదలను ఓడించలేకపోతున్నాయి. ఎందుకంటే రైతుకు ఉన్నది ఒక్కటే నమ్మకం ఏదో ఒక రోజు తన కష్టం ఫలిస్తుందనే ఆశ రైతు చెమట చుక్కతోనే దేశానికి అన్నం రైతు



ధైర్యంతోనే వ్యవసాయానికి జీవం అందుకే రైతు రాజు అనేది మాట కాదు అది రైతు కష్టానికి దక్కాల్సిన గౌరవం



హాలియా హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైది - రూ.15,000 జరిమానా....

ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:

హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో 24.09.2020 తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడు టేకి సురేష్‌కు ప్రత్యేక ఎస్సీ/ఎస్టీ కోర్టు, నల్గొండ జీవిత ఖైదు విధిస్తూ 23.11.2026 తేదీన తీర్పు వెల్లడించింది.హాలియాకు చెందిన యానక ప్రభాకర్ (34) వద్ద నిందితుడు టేకి సురేష్ రూ.30,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించే విషయంలో ఏర్పడిన వివాదం, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ప్రభాకర్‌ను హాలియా శివారులోని ఎన్ఎస్పీ ఎడమ కాలువ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి సుత్తితో తలపై పలుమార్లు కొట్టి హత్య చేశాడు.ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు హాలియా పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.202/2020 ఖ/ం 302 భూజ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సీసీటీవీ ఫుటేజ్, కాల్ డేటా రికార్డులు, ఫోరెన్సిక్ ఆధారాలు, హత్యకు ఉపయోగించిన సుత్తి మరియు ఇతర కీలక సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఈ కేసులో నిందితుడు టేకి సురేష్‌ను దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం భూజ సెక్షన్ 302 కింద జీవిత ఖైదు, రాజ/గూ గ్రూూ) చట్టం సెక్షన్ 3(2)(�జ) కింద జీవిత ఖైదు, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 92(ఖ) కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు మొత్తం రూ.15,000 జరిమానా విధించింది. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించింది.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారులు జె. శివకుమార్, అప్పటి ఎస్ఐ హాలియా, పి. వీర రాఘవులు, అప్పటి సీఐ హాలియా, వై. వెంకటేశ్వర్ రావు, అప్పటి ఎస్‌డీపీఓ మిర్యాలగూడ సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించారు. ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-× ఎస్. శోభారాణి వాదనలు వినిపించారు.ప్రస్తుతం హాలియా సీఐ ఎస్. రాఘవరావు, ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, మిర్యాలగూడ ఎస్‌డీపీఓ జి. రవి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కేసు విచారణకు అవసరమైన సమన్వయం అందించారు.నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడేలా నల్గొండ జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు దాతల చేయూత

53 మంది చిన్నారులకు రూ.10 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

దాతల సహకారం విద్యార్థులకు వరం : సర్పంచ్ సైదమ్మ

ప్రజా వాయిస్,పెన్‌పహాడ్:

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని గ్రామ సర్పంచ్ వలంపట్ల సైదమ్మ లింగయ్య అన్నారు. మండల పరిధిలోని దోసపాడు యూపీఎస్ పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు పిండిగ నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దొంగరి సుధాకర్, లీలావతి కుమార్తె, పూర్వ విద్యార్థిని దొంగరి స్రవంతి, ఆమె భర్త బచ్చు కృష్ణయ్య హెడ్ కానిస్టేబుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లను 53 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, దాతలు మరింతగా ముందుకు రావాలని కోరారు.బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్ మాట్లాడుతూ.. తాను చదువుకున్న రోజులతో పోలిస్తే నేడు పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 23, 2026 నుంచి ఏప్రిల్ 23, 2027 వరకు ప్రతి నెలా విద్యార్థుల పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తానని హామీ ఇచ్చారు.ఇటీవల పదవీ విరమణ పొందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం దాతలు స్రవంతి, అరుణ్, సాయి, కరుణ, లిఖిత శ్రీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల తరఫున వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొంగరి సుధాకర్, వలంపట్ల లింగయ్య, ఉపాధ్యాయులు కళ్యాణి, వై.వెంకన్న, విప్లవ్ కుమార్ తదితరులు



పాల్గొన్నారు.



ఇందిరమ్మ బీమాతో పేద కుటుంబాలకు భద్రత.. ఆర్థిక భరోసా

పాల్వాయిలో కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి

కుటుంబాలకు భరోసా కల్పించే బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్

ప్రజా వాయిస్: గుర్రంపోడు మండలం

నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో పేద కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ, ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పాల్వాయి గ్రామంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ ఈ పథకాన్ని ప్రారంభించి, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ పథకం కీలకంగా నిలుస్తుందని అన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తికి అనుకోని ఆపద ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారుఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండ్రపల్లి గిరి, పంచాయతీ కార్యదర్శి తలారి యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య గ్రామ పెద్దలు, నాయకులు మేకల నర్సింహా, బొడ్డుపల్లి హన్మంత్, గుర్రం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

సింగరేణి మారుపేర్ల బాధిత కుటుంబానికి బోడ జనార్దన్ పరామర్శ

ఉద్యోగం రాక ఆవేదనతో అనిల్ కుమార్ ఆత్మహత్యాయత్నం..

బాధితులకు అండగా ఉంటామని భరోసా

ప్రభుత్వ హామీ అమలులో జాప్యంపై మాజీ మంత్రి ఆవేదన సింగరేణి భవన్ ముట్టడికి తెలంగాణ రక్షణ సేన సన్నద్ధం

ప్రజా వాయిస్ బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో సింగరేణి మారుపేర్ల సమస్యతో ఉద్యోగం పొందలేక తీవ్ర మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించిన మందమర్రి ప్రాంతానికి చెందిన పిట్టల అనిల్ కుమార్ కుటుంబాన్ని మాజీ కార్మిక శాఖ మంత్రి బోడ జనార్దన్ పరామర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నిన్న రాత్రి బెల్లంపల్లిలోని బాధితుడి నివాసానికి చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. దసరా కానుకగా సింగరేణి మారుపేర్ల బాధితులకు 15 రోజుల్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చి నెల రోజులు కావస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంపై బోడ జనార్దన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న బాధితులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనిల్ కుమార్ ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో రావడంతో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారని, ఆమె ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించినట్లు బోడ జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ.. ఎవరూ అధైర్యపడవద్దని, న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగించాలని సూచించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కల్వకుంట్ల కవిత, తెలంగాణ రక్షణ సేన బాధితుల పక్షాన నిలుస్తాయని భరోసా ఇచ్చారు. మారుపేర్ల సమస్య పరిష్కారం కోసం త్వరలో సింగరేణి భవన్ ముట్టడి కార్యక్రమం చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని బోడ జనార్దన్ వెల్లడించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కల్వకుంట్ల కవిత లేఖ రాయనున్నట్లు తెలిపారు.సింగరేణి మారుపేర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని మాజీ మంత్రి బోడ జనార్దన్ స్పష్టం చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమములో తెలంగాణ రక్షణ సేన పార్టీ బెల్లంపల్లి మండల ప్రెసిడెంట్ మత్తమారి శశికాంత్. కాసిపేట అధ్యక్షుడు జగన్ మరియు సురేష్ లు జిల్లా జాయింట్ సెక్రెటరీ దుర్గం బానేష్ లుపాల్గొన్నారు.



నరేగా సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహణ.. పారదర్శకతకు పెద్దపీట!

16వ సామాజిక తనిఖీ ప్రజావేదికకు హాజరైన అధికారులు, గ్రామాల సర్పంచులు.. ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజా వాయిస్ వేమనపల్లి.

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో 16వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం మండల స్థాయిలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, కూలీలకు కల్పించిన ఉపాధి అవకాశాలు, పనుల అమలు తీరు, సంబంధిత రికార్డులు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహణకు సంబంధించిన కార్యక్రమం కొనసాగింది. ప్రభుత్వ పథకాలు అర్హులైన గ్రామీణ ప్రజలకు సక్రమంగా చేరుతున్నాయా? ఉపాధి హామీ పనులు నిబంధనల ప్రకారం అమలవుతున్నాయా? అనే అంశాలను సామాజిక తనిఖీ ద్వారా పరిశీలించడం ఈ ప్రజావేదిక ముఖ్య ఉద్దేశం.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కుమారస్వామి, ఎస్ఆర్పీ నాగరాజు, ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ మహేశ్వర్ రెడ్డి, ఈసీలు, టీఏలు, పీఎస్‌లు, ఎఫ్ఏలు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రక్రియలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడం, గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టడం, ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించేలా పర్యవేక్షించడం వంటి అంశాల్లో సామాజిక తనిఖీలు కీలక పాత్ర పోషిస్తాయి.ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టేందుకు అవకాశం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి సామాజిక తనిఖీ ప్రజావేదికను బాధ్యతాయుతంగా నిర్వహించడం ద్వారా పథకం అమలులో పారదర్శకత మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.ప్రజలకు ఉపాధి.. గ్రామాలకు అభివృద్ధి.. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతే లక్ష్యంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.





అర్హులందరికీ ఇందిరమ్మ బీమా అందేలా చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

ప్రజావాయిస్/వికారాబాద్:

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ మండలంలోని సిద్ధలూరు, దన్నారం గ్రామాల్లో పథకం నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ యజమాని మరణించిన సందర్భంలో నామినీల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, అనారోగ్యంతో నమోదు కేంద్రాలకు రాలేని వారి ఇళ్ల వద్దకే వెళ్లి నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులెవరూ పథకం ప్రయోజనాలు కోల్పోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్, ఎంపీడీవో వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో నాగభైరవి అమ్మవారు

పునర్నిర్మాణం కోసం భక్తుల ఎదురుచూపు
14వ శతాబ్దం నాటి పద్మనాయకుల వైభవం
నవాబుల కాలంలోనూ చెక్కుచెదరని విగ్రహం
నడుము వరకు పుట్టలో ఉండి, ఛాతి పైభాగం కనిపిస్తున్న ప్రత్యేకత



ప్రజావాయిస్/?సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని చారిత్రక రాచకొండ ప్రాంత పరిధిలో కొలువై ఉన్న శ్రీ నాగభైరవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం భక్తులు ఎదురుచూస్తున్నారు. 14వ శతాబ్దంలో పద్మనాయక రాజుల పాలనలో ఈ అమ్మవారు విశేషంగా పూజలు అందుకున్నట్లు చరిత్ర చెబుతోంది. అనంతరం నవాబుల కాలంలో ఇక్కడి అనేక ఆలయాలు ధ్వంసమై, నిధుల తవ్వకాలు జరిగినప్పటికీ నాగభైరవి అమ్మవారి విగ్రహాన్ని మాత్రం ఎవరూ కదిలించలేకపోయారని స్థానికులు చెబుతున్నారు. నడుము వరకు పుట్టలో ఉండి, ఛాతి పైభాగం మాత్రమే బయటకు కనిపిస్తూ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఎంతో శక్తివంతమైన, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థుల ఆశాజ్యోతి.. ఆర్ఎస్పీ

మోతె లో ఘనంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు
కేక్ కట్ చేసి సంబరాలు.. ప్రజలకు పండ్ల పంపిణీ



ప్రజా వాయిస్, మోతె, నవంబర్ 23:-

డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను మోతె మండల కేంద్రంలో స్వేరోస్, ఆర్ఎస్పీ సైన్యం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు పిడమర్తి దశరథ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గురుకుల విద్యా వ్యవస్థలో ప్రవీణ్ కుమార్ తీసుకొచ్చిన సంస్కరణలు, పేద విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. విద్య, సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం కోసం ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సామాజిక మార్పు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ మాజీ జిల్లా కోశాధికారి గట్టి గుండ్ల రాము, ఏర్పుల సాయికృష్ణ, ఆర్ఎస్పీ సైన్యం నాయకులు గురిజాల వెంకన్న, ధారమల్ల ఎలీషా, మాలోతు కోటి, ఆర్ఎస్పీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు కఠినంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజా వాయిస్ మంచిర్యాల

మంచిర్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి రహదారులపై ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, వాహనాల తనిఖీలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై వాహనాలు నిలిపే విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని, వాహనాలు బ్రేక్‌డౌన్ అయినా, డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవాలన్నా జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ నిలపకుండా నిర్దేశించిన ట్రక్ లే-బే ప్రాంతాలలో మాత్రమే నిలపాలని సూచించారు. ఈ విషయంలో జాతీయ రహదారుల అధికారులు, ఆర్ & బి అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా రహదారి భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి., డి.టి.ఓ. ద్వారా నామినేట్ చేయబడిన ఎంవిఐ, ఆర్ & బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎన్‌హెచ్ఎఐ డిప్యూటీ మేనేజర్, సంబంధిత రహదారుల అధికారులు, హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి, ఎన్‌హెచ్-363, ఎన్‌హెచ్-63, ఎస్‌హెచ్-24 ప్రతినిధులు సభ్యులుగా ఉండాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించాలని తెలిపారు. జాతీయ రహదారి-63ను ఉత్తర గోదావరి ప్రాంతం వైపు విస్తరించడంతో పాటు రాబోయే పుష్కరాల సమయంలో పెరిగే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతంలో లైటింగ్ సదుపాయాల లేమి కారణంగా భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే సంబంధిత హెచ్‌కెఆర్ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. కలెక్టరేట్ సముదాయం సమీపంలోని జాతీయ రహదారి-63పై వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, శ్రీరాంపూర్ సింగరేణి జి.ఎం. కార్యాలయం వద్ద వీధి దీపాలు, రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి, ఎన్‌హెచ్-363, ఎన్‌హెచ్-63, ఎస్‌హెచ్-24 లపై భారీ, వాణిజ్య వాహనాలు క్యారేజ్‌వే / పేవ్డ్ షోల్డర్లపై నిలిపి పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రియల్ టైమ్ అలర్టులు, జి.పి.ఎస్. టైమ్‌స్టాంప్ ఫొటోగ్రాఫిక్ ఆధారాలతో పర్యవేక్షించాలని తెలిపారు. జాతీయ రహదారులపై ప్రతి 50 కిలోమీటర్లకు ఒక హైవే పెట్రోలింగ్ వాహనాన్ని 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని, వాటికి స్పీడ్ గన్స్, నిఘా కెమెరాలు, పోలీసు శాఖతో అనుసంధానమైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు, ఆర్.డి.ఓ., రహదారుల శాఖల సమన్వయంతో కెమెరాలు, ట్రాకింగ్ పరికరాలు, స్పీడ్ గన్స్ కలిగిన పెట్రోలింగ్ వాహనాలను 30 రోజులలోగా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి, ఎన్‌హెచ్-363, ఎన్‌హెచ్-63, ఎస్‌హెచ్-24 లపై అక్రమ ఆక్రమణలు, కొత్తగా నిర్మించిన / నిర్వహిస్తున్న దాబాలు, తినుబండారాల కేంద్రాలను గుర్తించి వెంటనే తొలగించాలని తెలిపారు. జాతీయ రహదారులపై బిఎల్ఎస్ అంబులెన్సులు, రికవరీ క్రేన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రతి 75 కిలోమీటర్లకు ఒక ట్రక్ లే-బే ఏర్పాటు చేయాలని, ఇందులో విశ్రాంతి గదులు, ఆహార సదుపాయాలు, సురక్షిత పార్కింగ్, ప్రథమ చికిత్స సదుపాయాలు, 500 మీటర్ల దూరం నుంచే కనిపించే రిఫ్లెక్టివ్ రహదారి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లు, కీలక ప్రాంతాలను గుర్తించి హై ఇంటెన్సిటీ ఎల్ఈడి, హైమాస్ లైటింగ్, స్పీడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కెమెరాలు, రిఫ్లెక్టివ్ సూచిక బోర్డులు, ట్రాన్స్‌వర్స్ బార్ మార్కింగులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాలసీ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం 4 నెలలలోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హైవే సేఫ్టీ జోన్ల పరిధిలో ఎలాంటి కొత్త లైసెన్సులు, ఎన్ఓసిలు, ట్రేడ్ అనుమతులు మంజూరు చేయడం / పునరుద్ధరించడం చేయకూడదని, ఇప్పటికే మంజూరైన లైసెన్సులను 30 రోజులలోగా సమీక్షించాలని అధికారులకు సూచించారు. రోడ్లపై విచ్చలవిడిగా సంచరించే పశువుల వల్ల ప్రమాదాలు జరగకుండా మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వీధి పశువులను తరలించేందుకు నిపుణులైన యానిమల్ క్యాచర్లను నియమించేందుకు అవసరమైన అంచనాలను సమర్పించాలని తెలిపారు. పాఠశాల బస్సుల డ్రైవర్లకు సెలవు అనంతరం మరుసటి రోజు, ముఖ్యంగా సోమవారాలలో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని, అన్ని పాఠశాల బస్సులకు డి.టి.ఓ. ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలనే నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బెల్లంపల్లి కాల్ టెక్స్, కన్నాల ఫ్లైఓవర్ల వద్ద వేగంగా దిగి వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు మార్కింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మధుర జంక్షన్ వద్ద ప్రస్తుతం ఉన్న టీ జంక్షన్ స్థానంలో వై జంక్షన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచన మేరకు ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-363 ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ వద్ద అకస్మాత్తుగా వచ్చే మలుపుల గురించి వాహనదారులకు ముందస్తుగా తెలిసేలా తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట బస్టాండ్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, చింతపల్లి వద్ద బతుకమ్మవాగు ప్రాంతంలో రహదారికి ఇరువైపులా సరైన షోల్డర్లు నిర్మించాలని సూచించారు. మంచిర్యాల పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు ట్రాఫిక్ అధికారులు స్పీడ్ గన్స్, బ్రీత్ అనలైజర్లతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. మంచిర్యాల పట్టణ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జైపూర్ మండల పరిధిలో కొత్తగా నిర్మించిన జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్ల వద్ద చెల్లుబాటు అయ్యే బీమా, వాహన పత్రాలను పరిశీలించాలని తెలిపారు. అధిక బరువుతో వాహనాలు నడిపే వారిపై జరిమానాలు విధించాలని, లైసెన్సుల సస్పెన్షన్ / రద్దుకు సంబంధించిన కేసులను డి.టి.ఓ. ద్వారా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ చర్యల వివరాలను జిల్లా పౌర సరఫరాల అధికారికి పంపించి పత్రికలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకొని, పట్టుబడిన వారి వివరాలు, లైసెన్స్ రద్దు చర్యల కోసం డి.టి.ఓ.కు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు డి.పి.ఆర్.ఓ.కు పంపించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించి జరిమానాలు విధించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. భవన యజమానులు తమ భవనాలలోని సెల్లార్లను అద్దెకు ఇవ్వకూడదని, సెల్లార్లను కేవలం వాహనాల పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై కూరగాయలు విక్రయించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయంగా కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని సూచించారు. జాతీయ రహదారులకు వెళ్లే అప్రోచ్ రోడ్లపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్ & బి, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అమలు నివేదికలు సమర్పించాలని, ప్రజలలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టి మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాలలో పోస్టర్లు, ర్యాలీలు, అవగాహన సదస్సుల ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారిస్తూ మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, సాగును అరికట్టేందుకు పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అనుమానితుల కార్యకలాపాలపై నిఘా పెంచి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 8 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, 152 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి మొక్కల సాగుకు సంబంధించి 20 లైవ్ ప్లాంట్ కేసులు నమోదు కాగా, 156 మంది అనుమానితుల జాబితాను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి అవసరమైన కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరావాస సేవలు అందించాలని, యువత భవిష్యత్తును కాపాడేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మంచిర్యాల జిల్లా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్య కార్యదర్శి, ఆర్ & బి, జాతీయ రహదారుల శాఖ, పోలీసు, ట్రాఫిక్, రవాణా, రెవెన్యూ, మున్సిపల్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ శాఖల అధికారులు, వైద్యాధికారులు డా. సునీల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల సమస్యలతో బాధితుల ఇబ్బందులు
ఇళ్లు ఇచ్చినంత మాత్రాన బాధ్యత తీరదు, పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలి
బీజేపీ సూర్యపేట జిల్లా ప్రవాస కన్వీనర్ జల్లా జనార్దన్ రావు

ప్రజా వాయిస్,కోదాడ:

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ సూర్యపేట జిల్లా ప్రవాస కన్వీనర్ జల్లా జనార్దన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బిజెపి నాయకులతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి తన సొంత ఖర్చులతో విద్యుత్ సామాగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు నాలుగు సంవత్సరాల క్రితమే డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ, లబ్ధిదారులకు అందజేయడంలో జరిగిన జాప్యం వల్ల ఇళ్లలోని విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు చోరీకి గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాలు పొందిన పేద కుటుంబాలు విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు డ్రైనేజీ, మంచినీరు, రోడ్ల సమస్యలు కూడా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు ఇచ్చినంత మాత్రాన బాధ్యత తీరదని, లబ్ధిదారులు గౌరవంగా, ఆరోగ్యంగా జీవించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తి సుబ్రహ్మణ్యం, శెట్టి సుధారాణి, భూక్య సైదమ్మ, శాంతమ్మ, డబల్ బెడ్ రూమ్ బాధితులు పాల్గొన్నారు.....

ఫిర్యాదులు.. న్యాయపోరాటం..చివరకు కూల్చివేత

పీఎన్ఆర్ అపార్ట్‌మెంట్ స్థలంలో నిర్మించిన రెండంతస్తుల భవనంపై జీహెచ్ఎంసీ చర్యలు
గతంలోనే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్న అసోసియేషన్ సభ్యులు



ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

ఉప్పర్‌పల్లి పీవీఎన్ఆర్ పిల్లర్ నంబర్ 183 వద్ద గల పీఎన్ఆర్ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి రెండంతస్తుల భవనాన్ని పోరెడ్డి ధర్మారెడ్డి నిర్మించారంటూ అసోసియేషన్ సభ్యులు గత కొంతకాలంగా పోరాటం చేస్తున్నారు.ఈ నిర్మాణంపై గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్,అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ని కలిసి పూర్తి వివరాలను వెల్లడించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.కోర్టు ఆదేశాలు జారీ అయినప్పటికీ సర్కిల్ అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు.ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన అనంతరం జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.అపార్ట్‌మెంట్ స్థలాన్ని పరిరక్షించేందుకు తాము చేసిన ఫిర్యాదులు, న్యాయపోరాటం తర్వాతే ఈ చర్యలు ప్రారంభమయ్యాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.





పార్టీ కార్యాలయం కూల్చివేతపై ధర్మారెడ్డి ఫైర్

రాజకీయ కక్షతోనే బుల్డోజర్ చర్యలంటూ ఆరోపణలు
ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా బీఆర్ఎస్‌ను వీడేది లేదని స్పష్టీకరణ

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం కూల్చివేతపై ఆ పార్టీ రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జి పోరెడ్డి ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లర్ నంబర్ 183 సమీపంలో గత ఐదేళ్లుగా కొనసాగుతున్న కార్యాలయాన్ని ఇప్పుడు బుల్డోజర్‌తో కూల్చివేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు.తన రాజకీయ ఎదుగుదలను, స్థానికంగా బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే కొందరు అధికార పార్టీ నాయకులు ఇతర ప్రాంతాల రాజకీయ నాయకులతో కలిసి అధికారులపై ఒత్తిడి తెచ్చారని ధర్మారెడ్డి విమర్శించారు.గతంలో పలుమార్లు పార్టీ మారాలని తనపై ఒత్తిళ్లు తెచ్చినా అంగీకరించలేదని,అందుకే తనను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా మళ్లీ ఇతర ప్రాంతాల రాజకీయ పెత్తనం కొనసాగుతోందని ఆరోపించారు.ఎన్ని ఇబ్బందులు,ఒత్తిళ్లు ఎదురైనా బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని ధర్మారెడ్డి స్పష్టం చేశారు.రెండేళ్ల తర్వాత తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ,తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడినవారికి తగిన సమాధానం చెబుతానని హెచ్చరించారు.



ఇందిరమ్మ జీవిత బీమా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

జూలూరుపాడు, ప్రజా వాయిస్:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. మండల పరిధి పడమట నర్సాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, కార్యదర్శి కృష్ణ తో కలసి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి హార్దిక భరోసా కల్పించాలని ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, అర్హులైన గ్రామస్తులందరూ త్వరితగతిన దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మీ కుమారి కోరారు. తొలి రోజు సుమారు వందమందికి పైగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

నేరడిగొండ సమస్యలపై పాలనాధికారికి మూడు వినతిపత్రాలు

శిథిలమైన ప్రభుత్వ కార్యాలయాల స్థానంలో సమీకృత సముదాయం, నూతన పశు వైద్యశాల నిర్మించాలని విజ్ఞప్తి

జాతీయ రహదారికి ఇరువైపులా సేవా రహదారులు, మురుగు కాలువలు, పైవంతెన ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం



నేరడిగొండ మండల కేంద్రంలో నెలకొన్న దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు సాబ్లే సంతోష్ సింగ్, బొంతుకుల శ్రీను సోమవారం జిల్లా పాలనాధికారిని ప్రజావాణిలో కలిసి మూడు వేర్వేరు వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూ, మండల పరిషత్, మహిళా సమాఖ్య, ఉపాధి హామీ కార్యాలయాలతో పాటు ఆధార్ నమోదు కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, వర్షాకాలంలో పైకప్పులు కురుస్తూ విలువైన దస్త్రాలు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మరుగుదొడ్లు లేక మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నందున, అన్ని విభాగాలు ఒకే చోట ఉండేలా ఆధునిక సమీకృత భవన సముదాయాన్ని నిర్మించాలని మొదటి వినతిలో కోరారు. అలాగే కూలిపోయే స్థితిలో ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాలకు నూతన భవనం నిర్మించి, ఆధునిక పరికరాలు, మందులను అందుబాటులో ఉంచాలని రెండవ పత్రంలో విన్నవించారు.మండల కేంద్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కుంటాల మార్గం నుండి అల్పాహార శాలల వరకు ఇరువైపులా సేవా రహదారులు నిర్మించాలని, పశువులు అడ్డురాకుండా కంచె వేయాలని మూడవ పత్రంలో పేర్కొన్నారు. దెబ్బతిన్న మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా వీధి దీపాలు, ఉన్నత కాంతి దీపాలను అమర్చాలని కోరారు. భవిష్యత్తులో రహదారిని ఆరు వరుసలుగా విస్తరిస్తే ఊరి మధ్యలో పైవంతెన నిర్మించి, రెండుగా చీలిన స్థానిక వ్యాపార సముదాయాలకు పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మూడు అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని వారు అభ్యర్థించారు.

గర్భిణికి రక్తదానం.. మానవత్వం చాటుకున్న యువకుడు

అత్యవసర సమయంలో ఆపద్బాంధవుడిగా నిలిచిన కోరుట్ల వాసి రామిళ్ల అవినాష్

ప్రజా వాయిస్, కోరుట్ల:



అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఒక గర్భిణికి సకాలంలో రక్తదానం చేసి ఓ యువకుడు తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం హరీష్ వెంటనే స్పందించి, కోరుట్ల పట్టణానికి చెందిన రామిళ్ల అవినాష్‌ను సంప్రదించారు. హరీష్ విజ్ఞప్తి మేరకు అవినాష్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. సకాలంలో రక్తం అందించి గర్భిణి ప్రాణాలు కాపాడిన రామిళ్ల అవినాష్‌కు, ఇందుకు చొరవ చూపిన గడ్డం హరీష్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి

- రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్, సీపీఐ నాయకుల ధర్నా...
- తిరస్కరణకు గురైన దరఖాస్తులపై పునర్విచారణ చేపట్టాలి.. అర్హులకు న్యాయం చేయాలి

ప్రజా వాయిస్ గోదావరిఖని
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హత కలిగినప్పటికీ చేయూత పెన్షన్లు మంజూరు కాకపోవడంపై బీఆర్ఎస్, సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన కొందరి దరఖాస్తులు కూడా తిరస్కరణకు గురయ్యాయని ఆరోపిస్తూ, బాధిత దరఖాస్తుదారులతో కలిసి సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, సీపీఐ ఫ్లోర్ లీడర్లు మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో సుమారు 3,500 మందికి పైగా చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 600కు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. వీటిలో అర్హత ఉన్నవారి దరఖాస్తులు కూడా ఉండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వైట్ రేషన్ కార్డులు ఉన్నప్పటికీ కొందరికి పెన్షన్లు నిరాకరించడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేసినప్పుడు, అదే కార్డులు కలిగిన వారి పెన్షన్ దరఖాస్తులను తిరస్కరించడానికి గల కారణాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం పోలీసులు ఆందోళనకారులను కమిషనర్ వద్దకు తీసుకెళ్లగా, పెన్షన్లు రాని అర్హులైన దరఖాస్తుదారుల వివరాలు, దరఖాస్తులను ఆయనకు అందజేశారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మేకల సమ్మయ్య యాదవ్, మార్కపురి సూర్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు తాళ్ల రాజయ్య, రేఖా మహేష్, తోకల రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదమ్మ, జిల్లా సమితి సభ్యులు శనిగరపు చంద్రశేఖర్, కలవేని విజయలక్ష్మి, మండల శ్రీకాంత్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పెన్షన్ దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవ ప్రచార పత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా

ఈ నెల 26న జరగనున్న 77వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఘనంగా సన్నాహాలు

ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచన

ప్రజా వాయిస్, /ఆదిలాబాద్
ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న 77వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు సంబంధించిన ప్రచార పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగం కల్పించిన ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం మరియు సామాజిక న్యాయం వంటి ఉన్నత అంశాలపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని నిర్వాహకులకు దిశానిర్దేశం చేశారు.మాల, మహార్, నేతకాని మరియు అనుబంధ కులాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్ ఆర్.ఎస్., చిత్రు, ఐక్య కార్యాచరణ సమితి నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లు మంజూరు కాలేదు

ప్రస్తుతం అందుతున్నవి గతంలో సమర్పించిన పాత దరఖాస్తుల పెన్షన్లే

బీడీ కార్మికులు, వృద్ధులు, అర్హులందరికీ పెన్షన్ల కోసం త్వరలో బీజేపీ ఉద్యమం

బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్ స్పష్టీకరణ

ప్రజా వాయిస్, కోరుట్ల:



ప్రస్తుతం అందుతున్న పెన్షన్లు కొత్తవి కావని, గతంలో సమర్పించిన పాత దరఖాస్తులకు సంబంధించినవేనని బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రస్తుతం చేనేత, గీత కార్మికులు, దివ్యాంగుల పెన్షన్లు మాత్రమే అందుతున్నాయని, కొత్తగా ఒక్క పెన్షన్ కూడా మంజూరు కాలేదన్నారు. బీడీ కార్మికులు, 60 ఏళ్లు నిండిన వృద్ధులు, అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో త్వరలో ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఒకే ఇంట్లో రెండు, మూడు పెన్షన్ల అంశంపై అధికారులు పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుందని నరేష్ స్పష్టం చేశారు.





మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

మహిళలు, బాలికల భద్రత అందరి బాధ్యత: సీఐ మన్మధ కుమార్

నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ అవగాహన సదస్సు

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
విద్యార్థులు చెడు అలవాట్లు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని చౌటుప్పల్ రూరల్ సీఐ మన్మధ కుమార్ సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జింకల సాయి అధ్యక్షతన మత్తు పదార్థాల నిర్మూలన, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.?ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మహిళలు, బాలికలపై వేధింపులు జరిగితే భయపడకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యా కేంద్రాల్లో డ్రగ్స్‌కు తావులేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం అందించి డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై సీత పాండు,సీడబ్ల్యూసీ సభ్యురాలు వాణి,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు అరవింద్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

ఆర్థికంగా మహిళలు స్వావలంభన సాధించాలి

ప్రజా వాయిస్,కోదాడ:
కోదాడ మండలంలోని అల్వాలపురం, రెడ్లకుంట గ్రామాల్లో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాలను ఎమ్మెల్యే పద్మావతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో భవనం ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ఆర్థికంగా మహిళలు స్వావలంభన సాధించాలన్నారు. మహిళలు ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిలుకూరు మండలంలో బేతవోలు గ్రామంలో ఉపాధి హామీ నిధులతో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పోలేనిగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మునగాల మండలం బరాఖత్‌గూడెంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నడిగూడెం, కరివిరాల, కేశవాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవానాలను ప్రారంభించారు. అనంతరం మోడల్ స్కూల్‌లో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



?సొంత చెల్లెలిపై కట్టెతో దాడి చేసిన కేసులో నిందితుడికి జైలు శిక్ష - ఒక నెల సాధారణ కారాగార శిక్షరూ.500 జరిమానా విధిస్తూ బోథ్ న్యాయస్థానం తీర్పు

సొనాల గ్రామంలో పుస్తకాల విషయమై చెల్లెలి తలపై కట్టెతో కొట్టి గాయపరిచిన అన్న

నేరం రుజువు కావడంతో దోషికి శిక్ష విధించిన ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కుంభ సందీప్

నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా రక్షక అధికారి అఖిల్ మహాజన్

ప్రజా వాయిస్, / బోథ్ నియోజకవర్గం
బోథ్ రక్షకభట నిలయం పరిధిలో సొంత చెల్లెలిపై కట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడికి ఒక నెల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ బోథ్ ప్రథమ శ్రేణి న్యాయస్థానం గౌరవ న్యాయమూర్తి కుంభ సందీప్ సోమవారం తుది తీర్పు వెలువరించారు.పోలీసుల వివరాల ప్రకారం... బోథ్ రక్షకభట నిలయం పరిధిలోని సోనాల గ్రామానికి చెందిన తుల దేవేందర్ (45), తన పుస్తకాలు ఎక్కడ పెట్టావని సొంత చెల్లెలిని ప్రశ్నించగా, ఆమె ఇచ్చిన సమాధానంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ పక్కనే ఉన్న కట్టెతో ఆమె తలపై బలంగా కొట్టి గాయపరిచాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి బోథ్ ఉప రక్షక అధికారి కె. రవీందర్ కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.ఈ కేసు విచారణ సందర్భంగా ప్రభుత్వ సహాయ న్యాయవాది సిహెచ్. సతీష్ సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని సమర్థవంతంగా నిరూపించారు. సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఒక నెల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి కె. రవీందర్, ప్రస్తుత బోథ్ ఉప రక్షక అధికారి వి. పురుషోత్తం, ప్రభుత్వ సహాయ న్యాయవాది సిహెచ్. సతీష్, న్యాయస్థాన విధుల అధికారి సాంబాజీలను జిల్లా రక్షక అధికారి అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.



అన్నదానమే మహాదానం

అయ్యప్ప స్వాముల సేవలో రమేష్ నాయుడు బ్రదర్స్

రూ.10 వేల విరాళం అందించిన బాలకృష్ణ మాధవి దంపతులు

ప్రజా వాయిస్,కోదాడ:

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే మహోన్నత సేవ అనే సంకల్పంతో కోదాడ పట్టణంలోని విజయనగర్ బైపాస్ మెయిన్ రోడ్డులో అయ్యప్ప దేవాలయం సమీపంలో రమేష్ నాయుడు బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మామిడి బాలకృష్ణ, ఆయన సతీమణి మాధవి దంపతులు అన్నదాన కార్యక్రమానికి రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని దాతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గురుస్వామి శ్రీనివాస్ నాయుడు, బర్మవత్ సీతారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా..

ఇందిరమ్మ కుటుంబ భీమా'

అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గ్రామ సర్పంచ్ కొమురె నరేష్

ప్రజా వాయిస్ / దుబ్బాక:

భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కొమురె నరేష్ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ. 5 లక్షల భీమా సాయం అందిస్తుందని తెలిపారు. ఈ పథకం భూమిలేని పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, రేషన్ కార్డు ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులెవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి, వార్డు సభ్యుడు షరీఫ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వెంకట్ చారి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు దేవరాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

రెండో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

ప్రజా వాయిస్ - బెల్లంపల్లి నవంబర్ 23

బెల్లంపల్లి మండలంలోని కన్నాల బుగ్గ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం రెండో కార్తీక సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు కూరెళ్లి సతీష్ శర్మ ఆధ్వర్యంలో, తెల్లవారుజామున 5 గంటల నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు, భక్తుల సమక్షంలో గర్భగుడిలోని శివలింగానికి నిర్వహించిన మహా అన్నపూజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుడు సిద్ధం పోశం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. నాయకులు దూడం మహేష్ ఆధ్వర్యంలో పుల్ల సరిత--లక్ష్మీనారాయణ గౌడ్ దంపతులు అన్నప్రసాద వితరణ చేపట్టారు, ఇదిలా ఉండగా, మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణం కార్యక్రమాలకు దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఐకేపీ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

దళారులను నమ్మి మోసపోవద్దు.. ఆఖరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

సూపర్ ఎల్-నినో దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి

కథలాపూర్, సిరికొండ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి

ప్రజా వాయిస్, కథలాపూర్:

రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ సూచించారు. మండల కేంద్రంతో పాటు సిరికొండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ఆఖరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం 'సూపర్ ఎల్-నినో' ప్రభావం వల్ల నీటి ఎద్దడి ఏర్పడి వేసవి కాలంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలిచాల సత్యనారాయణ, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాయితీ నాగరాజు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు న్యావనంది శేఖర్, భూషణరావుపేట ప్యాక్స్ చైర్మన్ గడ్డం స్వామిరెడ్డి, సిరికొండ ప్యాక్స్ చైర్మన్ ఎండీ మోబిన్, సర్పంచ్ ముదం రవి, ఏఎంసీ డైరెక్టర్లు వాకిటి రాజారెడ్డి, రమేష్ నాయక్, వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు బీమా పథకాన్ని యథావిధిగా పునరుద్ధరించాలి - తహసీల్దార్‌కు వినతి

ఇందిరమ్మ బీమా కింద కుటుంబానికి ఒకరికే వర్తింపజేయడం సరికాదని ఆందోళన

పట్టా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు బీమా రక్షణ కల్పించాలని డిమాండ్

ప్రజా వాయిస్, / బోధ్ నియోజకవర్గం



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా విధానం ద్వారా కేవలం ఇంటికి ఒక్కరికి మాత్రమే ప్రయోజనం చేకూరుతోందని భారత రాష్ట్ర సమితి నాయకులు డుబ్బుల చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బజార్ హత్నూర్ మండల రెవెన్యూ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఒకే ఇంట్లో పలువురు అన్నదాతల పేరిట భూములు ఉన్నప్పుడు ప్రస్తుత నిబంధనల వల్ల మిగిలిన వారికి ఆర్థిక రక్షణ లేకుండా పోతోందని వివరించారు. గత పాలనలో భూమి పట్టా పాసుపుస్తకం కలిగిన ప్రతి ఒక్కరికీ రైతు బీమాను అమలు చేసి ఆపద సమయంలో కుటుంబాలకు కొండంత అండగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత పద్ధతిలోనే భూమి కలిగిన ప్రతి అన్నదాతకు ఈ సదుపాయాన్ని కొనసాగించాలని కోరారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.



బేగంపేట టీచర్ డిప్యూటేషన్ రద్దు చేయాలి

- 274 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలి.

- ఎనిమిది గ్రామాల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- జిల్లా ప్రజావాణిలో పిర్యాదు చేసిన బేగంపేట మాజీ సర్పంచ్ మద్ద ప్రవీణ్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్:

రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను రద్దు చేసి,పాఠశాలలోనే కొనసాగించాలని బేగంపేట మాజీ సర్పంచ్ మద్ద ప్రవీణ్,ఉప సర్పంచ్ మంకిడి స్వామి సోమవారం సిద్దిపేట జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేగంపేట పాఠశాలలో చుట్టుపక్కల 8 గ్రామాలకు చెందిన 274 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు.ఇప్పటికే ఉపాధ్యాయుల అవసరం ఉన్న నేపథ్యంలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం. వసంతను గజ్వేల్ మండలం బెజుగామ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలోనే గణితం ఉపాధ్యాయుడిని తిరుమలాపూర్ పాఠశాలకు డిప్యూటేషన్ పంపించారు.ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు,సర్పంచ్,ఎమ్మెల్యే,ఎంపీ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారని గుర్తుచేశారు.ఈ సమస్యపై పలు దినపత్రికల్లోనూ కథనాలు ప్రచురితమయ్యాయని తెలిపారు.గతంలో డిప్యూటేషన్‌ను విరమించుకుంటామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ,మళ్లీ ఉపాధ్యాయురాలిని బెజుగామ పాఠశాలకు పంపించేందుకు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి,బేగంపేట పాఠశాలలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు.8 గ్రామాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆటంకం కలగకుండా అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు.

వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

16 వేలకు పైగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

నియామక ప్రక్రియ సాగకపోవడంతో నిరుద్యోగ యువతలో నిరాశ

కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ డిమాండ్

ప్రజా వాయిస్, కోరుట్ల:



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 1.10 లక్షల మంది డీఎడ్, 2.40 లక్షల మంది బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఉన్నారని, మొత్తం 3.50 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు మూడు లక్షల మంది టెట్ అర్హత సాధించినప్పటికీ, నియామక ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో విద్యావంతులైన నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను, విద్యార్థులను ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 'చలో ఢిల్లీ'ను జయప్రదం చేయండి

ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

సీఐటీయూ నాయకుల పిలుపు

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజా వాయిస్ - బెల్లంపల్లి

దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 'ఆక్యుపై ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చల్లూరి దేవదాస్, భానుమతి కార్మికులకు, కార్మిక సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో సామాన్య కార్మికుల జీవన వ్యయం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు.

పోలీసింగ్ విధానాలు, క్షేత్రస్థాయి శిక్షణతో సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలి

24 వారాల పాటు జిల్లాలోని వివిధ పోలీస్ విభాగాల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందనున్న ట్రైనీ డీఎస్పీలు

ప్రజావాయిస్ రాజన్న సిరిసిల్ల



పోలీస్ శాఖలో విధులు బాధ్యతలు, పోలీసింగ్ విధానాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రాక్టికల్ శిక్షణ ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు పోలీస్ శిక్షణలో భాగంగా 24 వారాల పాటు వివిధ పోలీస్ విభాగాల్లో క్షేత్రస్థాయి ప్రాక్టికల్ శిక్షణ పొందేందుకు జిల్లాకు కేటాయించబడిన ట్రైనీ డీఎస్పీలు పి.రవికుమార్, బి.సందీప్ నాయక్ లు ఈరోజు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు ఈ సందర్భంగా జిల్లాఎస్పీ ట్రైనీ డీఎస్పీలకు జిల్లాలో కేటాయించిన వివిధ ప్రాక్టికల్ ట్రైనింగ్ యూనిట్లు, ఆయా విభాగాల పనితీరు, విధులు, బాధ్యతలు, పోలీస్ శాఖ నిర్వహించే కార్యకలాపాల గురించి వివరించారు శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ శాఖలోని ప్రతి విభాగం పనితీరుపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు ముఖ్యంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ విధులు, కేసుల నమోదు, నేర పరిశోధన, నిందితుల గుర్తింపు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు విధానాలు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి నేర్చుకోవాలని తెలిపారు.